


అసంబద్ధ విభజన

జిల్లాలో అతిపెద్ద మండలం ఆదోని. నియోజకవర్గంలోని మొత్తం గ్రామాలు ఒకే మండలంలో ఉండడంతో నిధుల కేటాయింపులో అన్యాయం జరుగుతోంది. దీంతో అభివృద్ధి అందని ద్రాక్షగా మారుతోంది. ఆదోనిని నాలుగు మండలాలుగా విభజించాలని ఇక్కడి ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదోని నుంచి విభజించి పెద్దహరివాణం కేంద్రంగా 17 గ్రామాలతో కొత్త మండలం ఏర్పాటు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆదోని జిల్లా సహా నాలుగు మండలాలుగా విభజించాలని ఆందోళన చేపట్టిన ప్రజలే.. 'పెద్దహరివాణం వద్దు.. ఆదోనిలోనే కొనసాగించాలి' అంటూ రోడ్డెక్కుతున్నారు. కొత్త మండల కేంద్రానికి ఆ గ్రామాలకు మధ్య దూరం 25-35 కిలోమీటర్లకు పైగా ఉండటమే ఇందుకు కారణం. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకుల అభిప్రాయం తీసుకోకుండా అసంబద్ధంగా విభజన చేయడంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.



పెద్దతుంబళంలో ఆందోళన చేస్తున్న ప్రజలు

- రెండు మండలాలుగా ఆదోని.. కొత్తగా పెద్దహరివాణం
- పలు గ్రామాలకు 25-35 కిలోమీటర్ల దూరం మండల కేంద్రం
- ఆదోనిలోనే ఉంచాలంటూ ప్రజాందోళన
- ఆదోని జిల్లా కోసం కొనసాగుతున్న ఉద్యమాలు

కర్నూలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండల పరిధిలో 40 పంచాయతీలు, 48 గ్రామాలు ఉన్నాయి. మండల మొత్తం జనాభా 2.15 లక్షలు. జిల్లాలోనే అతిపెద్ద మండలం ఇది. గతంలో ఆదోని మున్సిపాలిటీ, ఆదోని, కౌతాళం మండలాలు కలిసి ఆదోని అసెంబ్లీ నియోజవర్గంగా ఉండేది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన కారణంగా కౌతాళం మండలాన్ని మంత్రాలయం నియోజకవర్గంలో కలిపారు. ఆదోని అర్బన్, రూరల్ మండలం కలిపి నియోజకవర్గంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మండలాల వారీగా వివిధ పథకాల ద్వారా నిధులు కేటాయింపులు చేస్తే ఆదోని నియోజకవర్గానికి తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల పునర్విభజన కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. దీంతో అతిపెద్ద మండలమైన ఆదోని మండలాన్ని ఆదోని అర్బన్, ఆదోని రూరల్, పెద్దహరివాణం, పెద్దతుంబళం మండలాలుగా విభజించాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. మంత్రివర్గ ఉప సంఘానికి వినతి పత్రాలు కూడా ఇచ్చారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని మంత్రివర్గ ఉప సంఘం ఆదోనిని రెండు మండలాలుగా విభజించి పెద్దహరివాణం కేంద్రంగా 17 గ్రామాలతో కొత్త మండలం ఏర్పాటు చేసేలా సీఎం చంద్రబాబుకు నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా గత నెల 27న రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ విభజనపై ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా రాతపూర్వకంగా అందజేయాలని కలెక్టర్ సిరి పేర్కొన్నారు. గెజిట్ నోటిఫికేషన్ రావడంతో నిరసనలు వెల్లువెత్తాయి.



పెద్దహరివాణం మండలంలో ఉంచిన గ్రామాలకు ప్రస్తుతం మండలం ఆదోని, పెద్దహరివాణం మధ్య దూరం. కిలోమీటర్లలో..

గ్రామం	ఆదోని	పెద్దహరివాణం
గణేకల్లు	14	35
ఢాణాపురం	07	30
చాగి	12	35
నారాయణపురం	11	34
నాగనాథనహల్లి	14	37
బస్సాపురం	05	28
కడితోట	07	28
జి. హోసల్లి	11	31
హనవాల్	15	30
మదిరె	05	18
చిన్నహరివాణం	09	16
చిన్నగోనేహాల్	10	17
బలదూరు	23	12
యడవల్లి	27	04
సంతేకూడ్లూరు	15	07
పెద్దహవాణం	23	–
వి. కొండాపురం	02	23

అడ్డగోలుగా ఆదోని విభజన

ఆదోని మండలం నైసర్గిక స్వరూపం పరిశీలిస్తే.. ఆదోని కేంద్రం నుంచి తూర్పు వైపున ఆదోని-కర్నూలు వయా ఎమ్మిగనూరు, ఆదోని-గుత్తి వయా పత్తికొండ ప్రధాన రోడ్డు, పడమర వైపున ఆదోని-సిరుగుప్ప వయా పెద్దహరివాణం ప్రధాన రోడ్డు, ఉత్తరం వైపున ఆదోని-రాయచూరు వయా పెద్దతుంబళం ప్రధాన రోడ్డు, దక్షిణం వైపున ఆదోని-బళ్లారి వయా ఆలూరు ప్రధాన రహదారులు ఉన్నాయి.

మిగతా 6వ పేజీలో



ఆదోనిలో దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

పత్తి రైతులకు వెసులుబాటు

- స్లాట్ బుకింగ్‌కు 11గంటలకు పెంచిన సీసీఐ

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల సమస్యలను సీసీఐ సంస్థ గుర్తించింది. ఉదయం 11 గంటలకు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్‌ను బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు కోడుమూరు మార్కెట్ కమిటీ సెక్రటరీ సుందర్ రాజు తెలిపారు. గురువారం పెంచికలపాడులోని సీసీఐ కొనుగోలు కేంద్రంలో రైతులు అమ్మకానికి తెచ్చిన పత్తిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సీసీఐ సంస్థ అమలు చేస్తున్న నిబంధనలు, పత్తిని అమ్ముకోవడానికి కల్పించిన వెసులుబాటును రైతులకు వివరించారు. గతంలో ఉదయం 10 గంటల నుంచి పత్తి అమ్మకాలపై కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలంటూ షరతు విధించింది. దీంతో రైతులు ఇళ్లు, పొలాల వద్ద నుంచి సీసీఐ కేంద్రాలకు వచ్చేందుకు సమయం చాలక ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన కేంద్రం ఉదయం 11గంటల నుంచి స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అదేవిధంగా రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో 50 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి నమోదు చేసుకుంటున్నా కొనుగోలు కేంద్రాలకు మాత్రం తక్కువ మొత్తంలో పత్తిని తీసుకురావడం జరుగుతోందని సెక్రటరీ సుందర్‌రాజు తెలిపారు. దీంతో మిగిలిన రైతులకు అవకాశం లేకుండా పోతోందన్నారు. ప్రతి రైతు ఎంత మొత్తంలో పత్తిని సీసీఐ కేంద్రంలో అమ్మేందుకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకుంటారో అంతే మొత్తం పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పత్తిలో 8 శాతం నుంచి 14 శాతం తేమ ఉండేలా రైతులు జాగ్రత్త తీసుకోవాలని రైతులకు సూచించారు.



పెంచికలపాడులో పత్తిని పరిశీలిస్తున్న సెక్రటరీ సుందర్ రాజు

5లోపు దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ భూముల వివరాలను ఉమీద్ పోర్టల్‌లో శుక్రవారం లోపు నమోదు చేయాలని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి పర్వీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోర్టల్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇందులో వక్ఫ్ భూములు, ఆస్తుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

డీఆర్‌వోపై రాష్ట్ర డైరెక్టర్ల ఫిర్యాదు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా రెవెన్యూ శాఖ అధికారి వెంకట నారాయణమ్మపై నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ విజయకుమార్, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్లు మురళీ నాయుడు, మంజునాథ్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పీవీ సుబ్బయ్య గురువారం కలెక్టర్ డాక్టర్ సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు జిల్లా మాత్రమే ప్రొటోకాల్ పాటించడం లేదని వారు ఫిర్యాదు చేశారు.



జేసీకి ఫిర్యాదు చేస్తున్న రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు

శాంతి భద్రతలే ప్రధాన లక్ష్యం

ఎస్పీ విక్రాంత్ పాటిల్

చిప్పగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పోలీసుశాఖ పని చేస్తున్నదని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. గురువారం వార్షిక తనిఖీలో భాగంగా చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెదురుమొదురు సంఘటనలు తప్ప జిల్లా ప్రశాంతంగా ఉందన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు వాటి పురోగతిపై నమోదైన కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీ చేపట్టాలన్నారు. సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎస్పీ వెంట పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్‌ఐ సతీష్, ట్రైనీ ఎస్‌ఐ రాజాకుల్లాయప్ప, డీసీఆర్బీ సీఐ గుణశేఖర్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

భూ సేకరణకు నిధులు ఇవ్వండి..!
- వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుల పనులు తక్షణమే చేపట్టాలి

7

సమస్యల పరిష్కారానికి సానుకూలత

పాలనా సౌలభ్యం కోసమే డీడీవో కార్యాలయాలు

కలెక్టర్ సిరి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయిలో ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు సులువైన పాలనా సౌలభ్యం కోసమే డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కలెక్టర్ సిరి అన్నారు. గురువారం చిత్తూరు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి కార్యాలయాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్‌లో ఏర్పాటు చేసిన నూతన డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని కలెక్టర్‌తో పాటు పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరుచరిత, బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సులభంగా సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వం డీడీవో కార్యాలయాలను ప్రారంభించిందన్నారు. గ్రామస్థాయిలో రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు తదితర సమస్యలు ఎన్నో ఉంటాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు డివిజన్ స్థాయిలోనే ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జిల్లాలో కర్నూలు, పత్తికొండ, ఆదోని డివిజన్ అభివృద్ధి కార్యాలయాల ద్వారా ప్రజా సమస్యలను అధికారులు వేగంగా పరిష్కరిస్తారన్నారు.

- కూటమి ప్రభుత్వంతో పంచాయతీరాజ్ వ్యవస్థకు సర్వాధికారాలు వచ్చాయని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఉన్న 13,226 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు పెట్టి వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానం చేయడం రికార్డు అన్నారు.
- కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీరాజ్ వ్యవస్థ, గ్రామీణాభివృద్ధి బలోపేతం చేసేందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గ్రామీణ స్థాయిలో సీసీ రోడ్లు, తాగునీరు తదితర పనులు చేపట్టడంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జి. నాసరరెడ్డి, డీపీవో భాస్కర్, డీఎల్‌డీవో రమణారెడ్డి, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు వెంకటరమణయ్య, రమణారెడ్డి, డీఎల్‌పీవో లక్ష్మి, ఎంపీడీవో రాముడు, అనసూయ, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

నేడు పీటీఎం

- ఏర్పాట్లను పరిశీలించిన విద్యాశాఖ అధికారులు



కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు నూతన సంస్కరణలు చేపట్టింది. అందులో భాగంగానే పేరెంట్, టీచర్ మీట్-3 (పీటీఎం) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులను, పూర్వవిద్యార్థులను, ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను చేపట్టింది. ఇందులో భాగంగానే కర్నూలు జిల్లాకు గతంలో ఎన్నడూ లేనివిధంగా పాఠశాలల ప్రాంగణాలను వేదికగా మార్చారు. ఈ సమావేశాల్లో విద్యార్థులే తల్లిదండ్రులను, పూర్వ విద్యార్థులను, ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించేలా కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఏర్పాట్ల నిర్వహణకు గానూ కర్నూలు జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.54,61,650 బడ్జెట్‌ను కేటాయించింది. పాఠశాలలో ఎన్‌రోల్ దామాషా పద్ధతిన ఏర్పాట్ల నిర్వహణకు నిధులను కేటాయించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ లోకరాజ్ ఆధ్వర్యంలో పేరెంట్, టీచర్ మీటింగ్ విజయవంతం చేసేందుకు విద్యాశాఖ అధికారులు ఎస్‌ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) సభ్యులు కృషి చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అనంతరం 12:30 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా తల్లిదండ్రులు, వీఐపీలు, అధికారులతో కలసి విద్యార్థులు సహపంక్తి భోజనం చేస్తారు.

మెగా పేరెంట్స్ మీట్‌ను విజయవంతం చేయాలి

ప్రజల భాగస్వామ్యమే ప్రగతి సోపానం. ప్రజలు చైతన్యవంతులై ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి. ఈఏడాది పదో తరగతి పరీక్షల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఈ సమావేశం కీలకం కానుంది. డిసెంబరు 6 నుంచి అమలు కానున్న వంద రోజుల ప్రణాళికకు సంబంధించి, ముఖ్యంగా సీ, డీ గ్రేడ్ విద్యార్థుల పట్ల ఈ సమావేశంలో చర్చ జరగాలి. వంద రోజుల ప్రణాళిక అమలయ్యేందుకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లు చర్యలు పాఠశాల సిబ్బంది భాగస్వామ్యంతో చర్చించాలి.

- డాక్టర్ సిరి, కలెక్టర్

దేవుడి వరం ఘంటసాల 6

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి



దత్తాత్రేయ మూర్తికి పూలమాల వేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది







కర్నూలు కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గురుతత్వానికి ప్రతీకగా నిలిచే దత్తజయంతి వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా భక్తులు ఘనంగా నిర్వహించారు. షిరిడీ సాయిబాబాను భక్తులు దత్తాత్రేయుని స్వరూపుడిగా కొలిచి తరిస్తారు. ఈ నేపథ్యంలో నగరంలో వివిధ ప్రాంతాల్లో వెలసిన సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పాతనగరంలో దక్షిణ షిరిడీగా ఖ్యాతికెక్కిన షిరిడీ సాయిబాబా దేవస్థానంలో జరిగిన దత్తజయంతి వేడుకల్లో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ వేడుకలకు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది, ఇతర న్యాయాధికారులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎస్వీ విజయమనోహరి పాల్గొన్నారు. మధ్యాహ్నం 15వేల మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో దత్తజయంతి సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కేసీ కెనాల్ వినాయక ఘాట్ సమీపంలోని వినాయక మందిరంలో గల సత్యసాయి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.





పాతనగరం షిరిడీ సాయిబాబా దేవస్థానంలో

పరీక్షలకు ఇక బుక్‌లెట్

- విడి పేపర్లపై పరీక్షలు రాసే విధానానికి స్వస్తి
- సమ్మెటివ్ పరీక్షల్లో అమలు



చాగలమర్రి బాలికల పాఠశాలలో సమ్మెటివ్ పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు

చాగలమర్రి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పరీక్షలు రాసేందుకు బుక్‌లెట్ అందిస్తున్నారు. విడి పేపర్లపై పరీక్షలు రాసే విధానానికి స్వస్తి పలికారు. సబ్జెక్టుల వారీగా అన్ని పరీక్షలకు కలిపి వేర్వేరు బుక్‌లెట్లను అందించి పరీక్షలు రాయిస్తున్నారు. ప్రతి విద్యార్థి ప్రగతిని బట్టి ఉపాధ్యాయులు అవగాహన చేసుకునే వీలు ఏర్పడుతుంది. పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో చేయనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యారంగంలో వస్తున్న సంస్కరణలో భాగంగా ఇప్పటికే పాఠ్యపుస్తకాలను సమూలంగా మార్పుచేశారు. సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు ప్రతి విద్యాసంవత్సరంలో ఫార్మటివ్ అసెస్‌మెంట్ (యూనిట్) పరీక్షలు 4 జరుగుతాయి. క్వార్టర్లీ, హాఫియర్లీ, ఫైనల్ ఎగ్జామ్ స్థానంలో సమ్మెటివ్ అసెస్‌మెంట్ 1, 2 పరీక్షలను నిర్వహిస్తున్నారు. కొత్త విధానంలో మొదటి, రెండోవ సెమిస్టర్లలో రెండు ఫార్మటివ్, ఒక సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు వంతున జరుగుతాయి. ఇప్పటికే రెండు ఫార్మటివ్ పరీక్షలు ముగియగా ప్రస్తుతం సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు జరుగుతున్నాయి.



విద్యార్థులకు పంపిణీ చేసిన అసెస్‌మెంట్ బుక్‌లెట్లు

జిల్లా వ్యాప్తంగా 1.34 లక్షలు..

నంద్యాల జిల్లా పరిధిలో 1 నుంచి 5 ప్రాథమిక పాఠశాలలు 996 ఉండగా 45,558 మంది విద్యార్థులు, 21 యూపీ పాఠశాలలో 1,275 మంది విద్యార్థులు, 6 నుంచి 10వ తరగతి వరకు 86,492 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో 5,577 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికి 1.34 లక్షల అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ బుక్‌లెట్‌లలోనే పరీక్షల నిర్వహణ జరుగుతోంది.

అందంగా తీర్చిదిద్దారు

ఆకర్షణీయంగా ఉన్న పుస్తకాలపై పరీక్షలు రాసేలా నిర్ణయించిన ప్రభుత్వం, నిపుణుల సలహాలతో అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లను రూపొందించారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదివే ప్రతి విద్యార్థికి వారు చదువుతున్న తరగతులకు అనుగుణంగా ప్రతి సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ తయారు చేశారు.



పరిశీలిస్తున్న ఎంఈవో, హెచ్‌ఎం



విద్యాప్రమాణాలు పెంచేందుకే..

పేపర్లపై పరీక్షలు రాసే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలు పెంచేందుకే అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లు సబ్జెక్టుల వారీగా ఒకే బుక్‌లెట్‌లు పంపిణీ చేసింది.

● జీవయ్య, హెచ్‌ఎం, చాగలమర్రి



విద్యార్థుల ప్రగతికి దిక్సూచి

ప్రభుత్వం చేపట్టిన అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లు విద్యార్థుల ప్రగతికి దిక్సూచి. పరీక్షలు రాసే విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చారు. విద్యార్థులపై ఒత్తిడిలేని రీతిలో పరీక్షలు పేప ర్లపై కాకుండా ఆకర్షణీయంగా ఉన్న పుస్తకాలపై రాసేలా ప్రభుత్వం నిర్ణయించింది.

● న్యామతుల్ల, ఎంఈవో, చాగలమర్రి

దేవుడి వరం ఘంటసాల

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- అలరించిన 'ఘంటసాల స్వరార్చన'



గాయకుడు మిత్రను సత్కరిస్తున్న టీజీ వెంకటేశ్, జి. పుల్లయ్య, పత్తి ఓబులయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతికి దేవుడు ఇచ్చిన వరం దివంగత ఘంటసాల వెంకటేశ్వర రావు అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కొనియాడారు. గురువారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో దివంగత తెలుగు సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఘంటసాల వంటి గాయకులు తెలుగు పాటకు ఎంతో ఖ్యాతి సాధించి పెట్టారని గుర్తు చేశారు. సభాధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఘంటసాల 100వ జయంతిని టీజీవీ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించామని, నేడు ఆయన 103వ జయంతి సందర్భంగా మిత్ర వంటి గాయకులు కళాక్షేత్రానికి విచ్చేయడం ఎంతో స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరో సర్జన్ డబ్ల్యూ సీతారాం, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు బీఎస్ రావు, కార్యక్రమ కన్వీనర్ ఇనయతుల్లా, ఉపాధ్యక్షుడు గజల్ మహమ్మద్ మియా, కోశాధికారి కె. రామస్వామి, సీవీ రెడ్డి, కళాకారులు పి.రాజారత్నం, కేవీ రమణ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'ఘంటసాల స్వరార్చన'

ప్రముఖ సినీ గాయకుడు, అభినవ ఘంటసాల బిరుదు పొందిన హైదరాబాదుకు చెందిన గాయకుడు డీపీ మిత్ర, గాయని అఖిల బృందం ఆలపించిన అలనాటి ఘంటసాల పాటలు ప్రేక్షకులను ఆద్యంతం అలరింపజేశాయి. డీపీ మిత్ర బృందాన్ని టీజీ వెంకటేశ్ శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

ఏపీఐఐసీకి 4.96 ఎకరాలు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నంద్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గ పరిధిలోని ప్యాపిలి మండలం మాధవరం గ్రామంలోని రూ.26.04 లక్షలు విలువ చేసే 4.96 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉమ్మడి కర్నూలు జిల్లా ఏపీఐఐసీకి అప్పగిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల నవంబరు 28న సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినేట్ సమావేశంలో సదరు అంశంపై ఆమోదం పొందిన విషయం తెలిసిందే. సర్వే నెంబరు 691లో 3.21 ఎకరాలు, సర్వే నెంబరు 692లో 1.75 ఎకరాలు మొత్తంగా కలిపి 4.96 ఎకరాలను ఏపీఐఐసీకి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ భూమిని క్రషింగ్ అండ్ పల్వరైజింగ్ యూనిట్ ఏర్పాటు కోసం త్వరలో ఏపీఐఐసీ ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించనుంది.

వీధుల్లో కుక్కలపై నిషేధాస్త్రం

- సంరక్షణ బాధ్యత స్థానిక సంస్థలదే
- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- భవన సముదాయాలకు ఫెన్సింగ్ తప్పనిసరి
- 8 వారాల్లో చర్యలు పూర్తి చేయాలని ఆదేశం





కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు బెడద తీవ్రమైన నేపథ్యంలో పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాల్లో అవి కనిపించకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, పబ్లిక్ స్టోర్స్, కాంప్లెక్సు, బస్టాండులు, డిపోలు, రైల్వే స్టేషన్లలో ఉన్న కుక్కలను వెంటనే తొలగించాలని సుప్రీంకోర్టు సంచనల తీర్పు వెలువరించింది. వీధి కుక్కలను పట్టుకున్న తరువాత వాటికి స్టెరిలైజ్, వ్యాక్సినేట్ ఇచ్చిన తరువాత ఇక వాటిని అదే ప్రదేశంలో ఉంచరాదని, ఇట్లా చేస్తే కోర్టు తీర్పును భంగ పరిచినట్లవుతుందని కోర్టు తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం వీధి కుక్కలను నిర్దేశిత ఆశ్రమాలకు తరలించి, వాటి బాధ్యతను గ్రామాల్లో పంచాయతీలు, పట్టణాల్లో మున్సిపాలిటీలు తీసుకోవాలి. ప్రైవేటు, ప్రభుత్వ భవన సముదాయాలకు కుక్కలు లోపలికి రాకుండా చూడాలి.

బహిరంగ ప్రదేశాల్లో కుక్కలు నిషేధం..

బహిరంగ ప్రదేశాలలో కుక్కలు సంచరించడాన్ని ప్రభుత్వం నిషేధించింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారుల నెత్తిన పెట్టింది. వీధి కుక్కల నుంచి ప్రజలకు కాపాడటమే కాకుండా, వీధి కుక్కలను కూడా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికే ఉందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కుక్కలకు బహిరంగ ప్రదేశాలలో ఆహారం పెట్టడం కూడ ప్రభుత్వం నేరంగా పరిగణిస్తుంది. పట్టణాల్లో కుక్కలకు మున్సిపాలిటీ వారే ఆశ్రయం కల్పించాలి. రాబిస్ నివారణ చర్యలు పెంచాలి. నేషనల్ హైవే రోడ్లపై కుక్కలు, గొర్రెలు, మేకలు, బర్రెలు, తిరగడం కూడా నిషిద్ధమే. దీన్ని నేషనల్ హైవే రోడ్డు అథారిటీస్‌వారు, రోడ్డు ట్రాన్స్‌పోర్టు శాఖ అధికారులు అమలు చేయాలి.

8 వారాల్లో పూర్తి చర్యలకు ఆదేశం..

కుక్కల సంరక్షణ తీర్పును ఎనిమిది వారాల్లో అమలు చేయాలని సుప్రీంకోర్టు గడువు విధించింది. గడువు తక్కువగా ఉండటంతో మున్సిపల్ అధికారులు ఇప్పటి నుంచే కుక్కలను పట్టుకుని వాటిని తరలించే పని చేపట్టారు.

కుక్కలను పట్టుకునే పని ప్రారంభించాం

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జనసంచారంలో ఉండే వీధి కుక్కలను పట్టుకునే చర్యలు ప్రారంభించాం. ఇప్పటి వరకు సుమారు 200 పైగా కుక్కలను పట్టుకొని గార్గేయపురం డంప్ యార్డు కుక్కల సంతాన నియంత్రణ కేంద్రంలో వదిలిపెట్టాం. పందిపాడు సమీపంలో నాలుగు ఎకరాల స్థలాన్ని గుర్తించాం. త్వరలోనే అక్కడ తగిన ఏర్పాట్లు చేస్తాం. ఆసుపత్రులు, పాఠశాలలకు ప్రహరీ నిర్మించుకోవాలని నోటీసులు జారీ చేశాము.

● పి.విశ్వనాథ్, నగర పాలక కమిషనర్, కర్నూలు

అసంబద్ధ విభజన..!

(5వ పేజీ తరువాయి)

ఈ ఐదు రోడ్లకు 2-15 కిలోమీటర్ల దూరంలోనే గ్రామాలు ఉన్నాయి. పెద్దహరివాణం, యడవల్లి, బలదూరు గ్రామాలు మాత్రమే 23-27 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. నాలుగు మండలాలుగా విభజిస్తే ఆదోని అర్బన్ మినహా మిగిలిన మూడు మండలాలకు ఒక్కో మండలానికి 15 గ్రామాలు వస్తాయి. పెద్దహరివాణంకు 10-12 కిలో మీటర్లు చుట్టూ ఉన్న ఆదోని, హొళగుంద మండలాలలోని గ్రామాలు కలిపి పెద్దహరివారం మండలం, పెద్దతుంబళం చుట్టూ 10-12 కిలో మీటర్ల దూరంలో ఉండే ఆదోని, పెద్దకడబూరు మండలాల్లోని గ్రామాలను కలుపుతూ పెద్దతుంబళం మండలంగా, మిగిలిన గ్రామాలు ఆదోని మండలంలోనే ఉంచి విభజన చేసి ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదు. ఇందుకు విరుద్ధంగా కొత్తగా పెద్దహరివాణం మండలం ఒక్కటే ఏర్పాటు చేయడం. ఆ మండలంలో 25-35 కిలో మీటర్ల దూరంలో ఉండే గ్రామాలకు కలపడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కొత్తగా మండలం వచ్చిందనే సంతోషం కూడా లేకుండా పోయింది.

ఆదోని జిల్లా కోసం ఉద్యమాలు ఉధృతం

ఆదోని జిల్లా సాధన ఉద్యమం ఉధృతం అవుతోంది. ఆదోని పట్టణంలో జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 19వ రోజుకు చేరుకున్నాయి. ఆదోని పట్టణంలోని కోట్ల కూడలిలో వివిధ వర్గాల ప్రజలు, మేధావులు, విద్యార్థులు రిలే దీక్షలు మద్దతు పలికారు. పశ్చిమ ప్రాంత ఐదు నియోజకవర్గ పల్లెలు సమాగ్రాభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లా తోనే సాధ్యమని జిల్లా సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాదిగా ఆదోని డివిజన్ నిర్లక్ష్యానికి గురి అవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజనకు మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేస్తే ఆ సంఘానికి నేతృత్వం వహిస్తున్న మంత్రులు కనీసం ఇటువైపు కూడా రాకుండా పశ్చిమ ప్రాంత నియోజకవర్గాలైన ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ ప్రజలను మోసం చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. తమ మనోభావాలను ఆకాంక్షను గౌరవించకపోవడంపై త్వరలోనే గుణపాఠం చెప్తామన్నారు. ఇదిలా ఉండగా మంత్రాలయంలో నియోజకవర్గంలోని ఆదోని జిల్లాకోసం పోరాటాలు కొనసాగాయి. విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులతో పాటు వైసీపీ శ్రేణులు నిరసనలకు మద్దతు పలికాయి. మంత్రాలయంలోని రాఘవేంద్ర సర్కిల్‌లో నిరసనకారులు మానవహారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

పెద్దహరివాణం మాకొద్దు

ఆదోని మండలం నుంచి పెద్దహరివాణం గ్రామాన్ని విభజించి మండలంగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదోని మండలంలోని 16 గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మదిరె క్రాస్ వద్ద ఆదోని - శిరుగుప్ప ప్రధాన రహదారిపై చిన్నహరివాణం, మదిరె, చిన్నగోనేహాళ్ గ్రామస్తులు బైఠాయించి ఆందోళన చేశారు. 16 గ్రామాల ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఆగ్రామాలను పెద్దహరివాణంలో ఎలా కలుపుతారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 35 కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామాన్ని ఎలా మండల కేంద్రంగా పరిగణిస్తారని, ఈ ఆలోచన ఎలా వచ్చిందంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదోని మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో పాఠశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిలో బైఠాయించి ఆందోళన చేపట్టారు.



మంత్రాలయంలో ధర్నా చేస్తున్న నాయకులు

వాన తాకిడి

- తడిసిన వరి, మొక్కజొన్నలు
- జలమయమైన రహదారులు
- ఆందోళనలో రైతులు







చాగలమర్రి, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్లలో ధాన్యాన్ని కాపాడుకుంటున్న రైతులు

చాగలమర్రి/ ఉయ్యాలవాడ/ కొలిమిగుండ్ల , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావం చూపుతోంది. చాగలమర్రి, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల మండలాల్లో గురువారం ఉదయం భారీ వర్షాలు కురిశాయి. వాన తాకిడికి పంటలు దెబ్బతిన్నాయి. రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు జలమయమయ్యాయి. రహదారుల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, వరి ధాన్యం తడిసిపోయింది. చాగలమర్రి మండలం పెద్దబోదనం, గొడిగనూరు, ముత్యాలపాడు, మద్దూరు, చాగలమర్రి, మూడురాళ్లపల్లె రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న, వరి ధాన్యం రైతులకు నష్టం వాటిల్లింది. కోతకొచ్చిన వరి పంట నెలకొరిగింది. ఉయ్యాలవాడ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో రైతులు రోడ్లపై ఆరబెట్టుకున్న వరి ధాన్యం తడిసిపోయింది. ధాన్యంపై పట్టలు కప్పి రక్షించుకునే ప్రయత్నం చేసినా ఫలించలేదు. పట్టల కింద నుండి నీరు చేరి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ఈ ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేయరనే భయం రైతులను వెంటాడుతోంది. ప్రభుత్వం కొని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జీడీపీ ఎడమ కాలువకు నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న జేసీ

గోనెగండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాలువ కింద ఉన్న ఆయకట్టు భూముల్లో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకునేందుకు గాను గురువారం జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఎడమ కాలువ నీటిని విడుదల చేశారు. నీటి విడుదల పూజా కార్యక్రమంలో జీడీపీ సాగునీటి సంఘం అధ్యక్షుడు మల్లికార్జున గౌడ్, టీడీపీ మండలకన్వీనర్ తిరుపతయ్య నాయుడు పాల్గొన్నారు. ఎడమ కాలువ ద్వారా ప్రస్తుతం రైతుల అవసర నిమిత్తం 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమ కాలువ కింద 3,500 ఎకరాలు సాగు కావాల్సి ఉంది. ఈ ఏడాది దాదాపు 1300 నుంచి 1400 ఎకరాల లోపు సాగు కావచ్చునని అధికారులు చెబుతున్నారు. జేసీ నూరుల్ ఖమర్ ప్రాజెక్టులో ఎన్ని టీఎంసీల నీరు ఉంది?, ఎన్ని ఎకరాలకు సాగు నీరు అందించవచ్చు?, ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలు ఎన్ని ఎన్ని వేల ఎకరాలు ప్రాజెక్టు విస్తరించి ఉంది? అని ఏఈ మహమ్మద్ ఆలీని అడిగి తెలుసుకున్నారు. ఆయకట్టు రైతులకు రబీ సీజన్‌లో సాగునీటి సమస్య రాకుండ చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఉగ్రనరసింహుడు, హెచ్‌కైరవాడి సహకార సంఘం అధ్యక్షుడు తిమ్మారెడ్డి, రాజేష్, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖపై చిన్నచూపు

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- కాగితాలకే పరిమితమైన కొలువులు
- పనిభారంతో సతమతమవుతున్న ఉద్యోగులు



జిల్లా పరిశ్రమల కేంద్రం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల శాఖపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. జిల్లా పరిశ్రమల కేంద్రంలో కీలకమైన స్థానాలు ఖాళీ గా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, వాటి అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈతరుణంలో వాటి అమలుకు అవసరమైన ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో అందుబాటులో ఉన్న సిబ్బందిపైనే పనిభారం పడటంతో పాటు పలు రకాల పథకాలపై కూడా వీటి ప్రభావం పడతోంది.

కీలక స్థానాలు ఖాళీ

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధిలో పరిశ్రమల అభివృద్ధి అధికారుల(ఐపీవో) పాత్ర ఎంతో కీలకం. ఉమ్మడి జిల్లా విభజనానంతరం కర్నూలు జిల్లాకు 8మంది ఐపీవోలు అవసరమని సంబంధిత అధికారులు సూచించారు. వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నం. ఉద్యోగుల ఆవశ్యకతకు, ప్రభుత్వం మంజూరు చేసిన స్థానాలకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి పొంతన లేకుండా పోయింది. 8స్థానాలకుగాను ప్రభుత్వం ఆరింటిని మంజూరు చేసింది. ఇందులో 5మంది క్షేత్రస్థాయిలో పనిచేసేలా, ఒకరు కార్యాలయంలో పత్రాల పరిశీలన చేసేలా విధులను కేటాయించారు. ఈ నియామకాలు కాగితాలకే పరిమితమయ్యాయి, తప్ప ఆచరణలో సాధ్యం కాలేదు.

ఆరుగురు ఐపీవోలకు గాను..

ఆరుగురు ఐపీవోలకు గాను ఇద్దరు మాత్రమే కార్యాలయంలో అందుబాటులో ఉండగా, మరొకరు దీర్ఘకాలిక సెలవులో వెళ్లటం గమనార్హం. వీటితో పాటు పరిశ్రమల పర్యవేక్షణలో కీలకమైన సహాయ సంచాలకుని స్థానం ఖాళీ పడింది. ఐపీవోలకు మార్గనిర్దేశనం చేస్తూ క్షేత్ర స్థాయికి, కార్యాలయానికి అనుసంధానకర్తగా ఉండే ఈస్థానం ఏడాది కాలంగా భర్తీ కాకపోవటం కూడా పరిశ్రమల అభివృద్ధిలో ప్రతికూలాంశమే. కార్యాలయ వ్యవహారాల్లో చురుగ్గా ఉండే ఇద్దరు దిగువ శ్రేణి సహాయకుల్లో ఒకరి స్థానం, నాల్గవ తరగతి ఉద్యోగుల్లో మరొకరి స్థానం సైతం భర్తీ కాలేదు. మొత్తం ఇరవై మంది ఉద్యోగులు అవసరంగా కాగా, కేవలం 11 మందితోనే కార్యాలయాన్ని భారంగా నిర్వహిస్తున్నారు.

పథకాల అమలుపై ప్రభావం

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, ఉద్యం నమోదు, తదితర పనులు పరిశ్రమల శాఖ పరిధిలోనే నిర్వహిస్తుండటంతో ఈ కీలక స్థానాలు ఖాళీ కావటం శాఖపరంగా ఇబ్బందిగా మారింది. ఖాళీగా ఉన్న ఉద్యోగుల భర్తీ అత్యంత అవశ్యకంగా మారింది. లేని పక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్టాత్మక పథకాల అమలు, పరిశ్రమల ఏర్పాటు పనులు మందకొడిగా సాగే ప్రమాదం లేకపోలేదు.



ఉన్నతాధికారులకు నివేదించాం

శాఖలోని ఖాళీలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాం. నివేదిక ఆధారంగా భవిష్యత్తులో జరిగే నూతన నియామకాల ద్వారా ఖాళీలను భర్తీ చేస్తాం.

● అశోక్ కుమార్, జీఎం, జిల్లా పరిశ్రమల కేంద్రం, కర్నూలు

భూ సేకరణకు నిధులు ఇవ్వండి..!



అసంపూర్తిగా ఆర్డీఎస్ హెడ్ స్లూయిస్ పనులు

- వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుల పనులు తక్షణమే చేపట్టాలి
- జీఆర్‌పీ నిర్వహణకు ఐదేళ్లకు నిధులు కేటాయించాలి
- పీఏసీ సమావేశంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి డిమాండ్
- సానుకూలంగా స్పందించిన స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్

కర్నూలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టుల పనులు కాంట్రాక్టు సంస్థలు చేపట్టాలంటే భూ సేకరణ కోసం నిధులు విడుదల చేయాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. అమరావతిలో బుధ, గురువారం రెండు రోజులు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) సమావేశం చైర్మన్ పులపర్తి రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. పీఏసీ సభ్యులైన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బూర్ల రామాంజనేయులు, అరిమిల్లి రాధాకృష్ణ, అశోక్‌రెడ్డి, నక్క ఆనంద్, కోళ్ల లలితకుమారి, విష్ణుకుమార్‌రాజు సహా జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల సీఈ కబీర్‌బాషా హాజరయ్యారు. జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టుపై చర్చించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలనే ఆశయంతో ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని 2019 జనవరిలో అప్పటి సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకొని జీవో ఆర్టీ నం.76 జారీ చేసి, రూ.1,985.42 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆర్డీఎస్ అనకట్ట వద్ద హెడ్ స్లూయిస్, కాలువ నిర్మాణం పనులను మొదలు పెట్టారని, గత వైసీపీ ప్రభుత్వం ఆపేసిందని గుర్తు చేశారు. మన కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో చేర్చి తక్షణం పనులు మొదలు పెట్టాలనే ఆదేశాలు ఇచ్చారు. అయితే.. భూ సేకరణ చేయకపోవడంతో పనులు చేయలేని పరిస్థితుల్లో ఉందని, అందుకు అవసరమైన నిధులు ఇవ్వాలని కోరారు. అలాగే.. గురురాఘవేంద్ర ప్రాజెక్టు నిర్వహణకు ఏటేటా ప్రతిపాదనలు తయారు చేయడం వల్ల ఎన్నో ఇబ్బందులు వస్తున్నాయని, ఐదేళ్లకు ఒకేసారి డీపీఆర్ తయారు చేసి నిర్వహణ బాధ్యతలు కాంట్రాక్ట్ సంస్థలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని సూచించారు. పత్తికొండ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ తాను పత్తిపాడు ఎమ్మెల్యే అయినా.. తన స్వగ్రామం ఆలూరు అని, వేదవతి ప్రాజెక్టు పూర్తయితే ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. తక్షణం నిధులు ఇచ్చి భూసేకరణ చేసి ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలనే అభిప్రాయానికి జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ సానుకూలంగా స్పందించారు.



హంద్రీనీవా కాలువ వద్ద ఆగిపోయిన వేదవతి ప్రాజెక్టు స్టేజ్-2 పంప్‌హౌస్ పనులు

డీమార్టులో మహిళల చేతివాటం

- రూ.5వేలకు బిల్లు చెల్లించి, రూ.25వేల సరుకుతో ఉడాయించే యత్నం..
- పోలీసులకు అప్పగించిన నిర్వాహకులు

కర్నూలు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద ఉన్న డీ మార్ట్ షాపింగ్ మాల్‌లో ఇద్దరు మహిళలు చేతివాటం ప్రదర్శించారు. రూ.5వేల బిల్లు చెల్లించి రూ.25వేల సరుకుతో ఉడాయించే ప్రయత్నం చేయగా సిబ్బంది గమనించి పోలీసులకు అప్పగించారు. వివరాల మేరకు.. గురువారం సాయంత్రం బురఖా ధరించిన ఇద్దరు మహిళలు సరుకులు కొనుగోలు చేసేందుకు డిమార్టు వచ్చారు. రూ.5వేల సరుకులు కొనుగోలు చేసినట్లు బిల్లు వేయించుకున్నారు. బయటకు వచ్చే సమయంలో సరుకులు ఎక్కువగా ఉండటంతో అనుమానం వచ్చిన సెక్యూరిటీ గార్డులు తనిఖీ చేయగా నాలుగైదు బ్యాగుల్లో సరుకులు ఎక్కువగా కనిపించాయి. దీంతో స్టోర్ నిర్వాహకులు సీసీ కెమెరాలను పరిశీలించగా వీరి భాగోతం వెలుగులోకి వచ్చింది. సుమారు రూ.25 వేల విలువైన సరుకులు, వస్తువులు రహస్యంగా చోరీ చేసినట్లు గుర్తించి నిలదీశారు. మహిళలు డిమార్టు మేనేజర్‌తో వాగ్వాదానికి దిగి ఘర్షణ పడ్డారు. మేనేజర్ ఇద్దరు మహిళలను నాలుగో పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు. కాగా ఆ మహిళలు తమ పేర్లు, చిరునామా తప్పుగా ఇచ్చినట్లు సమాచారం.

దొంగ అరెస్టు

- నగదు, వెండి ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

గడివేముల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తమూలపెద్దమ్మ ఆలయంలో సెప్టెంబరు 9న గుర్తు తెలియని దుండగులు ఆలయ గేటును ధ్వంసం చేసి హుండీ చోరీ చేశారు. ఈ కేసులో ఏఎస్పీ మందాజావలి ఆల్ఫోన్స్ ఆదేశాల మేరకు ఎస్ఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందితో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. దొంగతనానికి పాల్పడ్డ ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం బోలుపల్లె గ్రామానికి చెందిన సాయిరామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద రూ.48,257 నగదు, అమ్మవారికి చెందిన 520 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

కండక్టర్‌పై వైసీపీ నాయకుడి దాడి

కోసిగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోల్‌మాన్‌పేట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గుడిసె రామాంజనేయులు ఆర్టీసీ బస్సు కండక్టర్ పొద్దుటూరు కమల్‌పై గురువారం కలోమాన్ పేటలో దాడి చేసి గాయపరిచాడు. వివరాలివీ.. ఆదోని డిపోకు చెందిన కోసిగి-తుంగభద్ర బస్సులో ఆదోని నుంచి కోల్‌మాన్‌పేట వరకు వచ్చిన రామాంజనేయులు బస్సు దిగే క్రమంలో కండక్టర్‌ను తోసుకుంటూ



కండక్టర్‌ను బెదిరిస్తున్న గుడిసె రామాంజనేయులు

కిందకు దిగుతుండటంతో చూసుకుని నిదానంగా దిగండి అని కండక్టర్ చెప్పగా రామాంజనేయులు కండక్టర్‌పై దాడి చేశాడు. దీంతో కండక్టర్ కోసిగి పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐ ఈశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్‌రెడ్డి తెలిపారు.

సచివాలయ ఉద్యోగి మృతి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ వార్డు ఇందిరానగర్ వెల్ఫేర్ సచివాలయ ఉద్యోగి రాజారత్నం(40) గురువారం తెల్లవారుఝామున మృతి చెందారు. వగరూరు గ్రామానికి చెందిన రాజారత్నం సచివాలయ వెల్ఫేర్ ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడున్నారు. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందారు. సచివాలయ ఉద్యోగులు రాజారత్నంకు నివాళి అర్పించారు. కమిషనర్ గంగిరెడ్డి వగరూరు గ్రామానికి వెళ్లి నివాళి అర్పించారు. పట్టణంలో సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు సాయంత్రం సోమప్ప సర్కిల్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులపై పని భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



రాజారత్నం (ఫైల్)

వ్యక్తి అనుమానాస్పద మృతి

నందవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన గొల్ల రవి(38) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో వంట గదిలో ఉరి వేసుకొని ఉన్నాడు. రవికి ఇంటి పక్కన వారితో ఇటీవల గొడవ జరిగిందని, ఈ విషయంలో వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారని అతడి భార్య అంజినమ్మ పోలీసులకు తెలిపారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రవి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.



రవి (ఫైల్)

పాము కాటుతో విద్యార్థి మృతి

కౌతాళం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుతపల్లి గ్రామంలో పాటుకాటుతో విద్యార్థి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. కురువ లింగన్న, ఉరుకుంద దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు అర్జున్(11) గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి నిద్రపోయాడు. తెల్లవారుజామున నిద్రలోనే పాము కాటు వేయడంతో తనకు ఏదో కుట్టినట్లు అయిందని తల్లిదండ్రులకు చెప్పాడు. బాలుడి నోటి నుంచి నురుగు వస్తుండటంతో పాము కాటుకు గురైనట్లు గుర్తించి ఆదోని ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. గురువారం ఎంఈవో-2 శోభారాణి క్లస్టర్ హెచ్‌ఎం హరి ప్రసాద్‌తో కలిసి గ్రామానికి వెళ్లి విద్యార్థి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మట్టి ఖర్చులకు తగిన ఆర్థిక సాయం అందించారు.



అర్జున్ (ఫైల్)

ఆదోని జిల్లా.. ప్రజల ఆకాంక్ష!



సీఎంకు వినతి పత్రం ఇస్తున్న తిక్కారెడ్డి

- ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలి
- సీఎం చంద్రబాబుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి విన్నపం

కర్నూలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ఆదోని జిల్లా అనేది.. పశ్చిమప్రాంత ప్రజల ఆకాంక్ష. జిల్లాల పునర్విభజనలో ఆదోని ప్రస్తావన లేకపోవడంతో ప్రజలు రోడ్డెక్కారు. ఆందోళనలు చేస్తున్నారు. జిల్లా ఏర్పాటుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలి..' అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్పతో కలసి గురువారం రాత్రి ఆయన ఉండవల్లిలో సీఎం చంద్రబాబును కలిశారు. ఆదోని జిల్లా సాకారం చేయడంతో పాటు అసంబద్ధంగా జరిగిన ఆదోని మండల విభజనను సరి చేయాలని తిక్కారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదోని జిల్లా కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో పాటు ప్రతిపక్ష వైసీపీ నాయకులు కూడా డిమాండ్ చేస్తున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల ముందు ఆదోని జిల్లా చేస్తామని హామీ ఇచ్చామా? అని సీఎం చంద్రబాబు అడిగారని, ఆ సమయంలో ఆదోని జిల్లా డిమాండ్ లేకపోవడంతో హామీ ఇవ్వలేదని తిక్కారెడ్డి వివరించారు. ప్రజల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకుని ఆదోని జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమయంలో జిల్లా పార్టీ నాయకులు, ఎంపీ, ఎమ్మెల్యేలు మంత్రివర్గ ఉప సంఘం దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని సీఎం చంద్రబాబు ప్రశ్నించినట్లు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రి టీజీ భరత్, టీడీపీ జోన్-5 ఇన్‌చార్జి బీదా రవిచంద్ర, ఎంపీ, ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులు చర్చించి జిల్లా ఏర్పాటుపై సాధ్యసాధ్యాలు, రాజకీయ అంశాలపై సమగ్ర నివేదిక తెప్పించుకుంటానని సీఎం చెప్పారని తిక్కారెడ్డి తెలిపారు. అదేవిధంగా జిల్లాలో టీడీపీ తాజా పరిస్థితిపై అధినేత చంద్రబాబుకు నివేదిక అందజేసినట్లు పేర్కొన్నారు.

సూర్యఘర్‌పై ప్రచారం చేయండి

- కర్నూలు కలెక్టర్ డాక్టర్ సిరి
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకం వినియోగించుకోవాలని ప్రచారం చేయాలని కలెక్టర్ డాక్టర్ సిరి ఆదేశించారు. గురువారం చాంబర్‌లో అధికారులతో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రూఫ్ టాప్ సోలార్ ప్లాంటుపై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గిందని అవగాహన కల్పించాలన్నారు. మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి దేశం అంతటా కోటి గృహాలకు సౌర వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్లాంటు ఇస్తుందన్నారు. సమావేశంలో ఎస్ఈ ప్రదీప్ కుమార్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

కోవెలకుంట్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగొట్ల, ఉప్పలూరు గ్రామాల మధ్య గురువారం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. నంద్యాల నుంచి కోవెలకుంట్లకు వెళ్తున్న లారీ ఉప్పలూరు కలుగొట్ల దగ్గరికి వచ్చేసరికి బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా సైడ్ రోడ్డులో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి గుంతలో పడింది. లారీ డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

రాయల్టీ లేని లారీలు సీజ్

బేతంచెర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ నాపరాళ్ల ఫ్యాక్టరీలలో లోడ్ చేసుకుని రాయల్టీ లేకుండా వెళ్తున్న లారీలను ప్రైవేట్ రాయల్టీ కంపెనీ యాజమాన్యం కర్నూలు ఏడిఎంజీ అధికారులకు అప్పజెప్పినట్లు రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయ రెడ్డి తెలిపారు. బేతంచర్ల నుంచి కర్ణాటక తదితర ప్రాంతాలకు రాయల్టీ లేకుండా నాపరాళ్లను రవాణా చేయడంతో ప్రైవేట్ రాయల్టీ యాజమాన్యం ఏడీఎంజీ అధికారులకు అప్పగించారని ఆయన తెలిపారు. సీజ్ చేసిన లారీలను బేతంచర్ల పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ఆస్తి పన్ను బకాయిలపై కొనసాగుతున్న దాడులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. రెండో రోజు గురువారం కిడ్స్ వరల్డ్ సమీపంలోని నేషనల్ టీ స్టాల్ అండ్ స్వీట్ షాపునకు సంబంధించి రూ.6.58 లక్షలు, గీతాంజలి నర్సింగ్ కాలేజీకి సంబంధించి రూ.5.53 లక్షల బకాయి ఉండటంతో రెండు వ్యాపార సముదాయాలను సీజ్ చేశారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి అధ్వర్యంలో మొండి బకాయిల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ 6 సంవత్సరాలకు పైగా ఆస్తి పన్ను చెల్లించకపోతే ఆర్ఆర్ యాక్టు ప్రకారం ఆస్తి జప్తునకు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు నగరంలో రూ.130 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, కార్పొరేషన్‌కు నష్టం కలిగించవద్దని సూచించారు. త్వరలో టాప్-100 మొండి బకాయిదారుల వివరాలు ప్రధాన కూడళ్లు, బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శిస్తామన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయ భవనాల బకాయిల కోసం లేఖలు రాస్తామన్నారు. ఆర్‌వో జునైద్, ఆర్ఐలు రాజు, శ్రీకాంత్, భార్గవత్, కే.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు రైలు నడపాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న గౌస్‌దేశాయ్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4(ఆంధ్ర జ్యోతి): కర్నూలు నుంచి విజయవాడకు రైలు నడపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. గురువారం ఢిల్లీలో పార్లమెంటు సభ్యుడు సచ్చిదానందకు వినతి పత్రం అందజేశారు. కేంద్ర రైల్వే మంత్రితో ఈ విషయంపై చర్చించాలని గౌస్‌దేశాయ్ కోరారు. కర్నూలు నుంచి నేరుగా విజయవాడకు రైల్వే సౌకర్యం లేకపోవడంతో బస్సులను ఆశ్రయించాల్సి వస్తోందని వివరించారు

సమస్యల పరిష్కారానికి సానుకూలత



ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- ఆరు అంశాలపై ఉత్తర్వులు ఇచ్చిన అధికారులు
- ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

నంద్యాల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఉదయానంద హోటల్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి 6 అంశాలపై చర్చించి సానుకూలంగా స్పందించారన్నారు. వెంటనే ఉత్తర్వులు కూడా అధికారులు ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో 32 వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. పెన్షనర్లకు కాంటమ్నైజేషన్ 3 శాతం, ఇంటి బాడుగలకు 4 శాతం కోత విధించిందన్నారు. కూటమి ప్రభుత్వం రూ. 12 వేల కోట్ల పాత బకాయిలు చెల్లించిందన్నారు. 2022 నుంచి 2024 సరెండర్ లీవ్‌లకు బకాయిలు కూడా గత ప్రభుత్వం చెల్లించలేదన్నారు. 25 లక్షల కుటుంబాల ఉద్యోగుల కుటుంబాలకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదని, పేమెంట్, ఉద్యోగుల హెల్త్‌కార్డుకు ఇన్సూరెన్స్ అనుసంధానంలో, నూతన వైద్యులను నియమించడంలో, సీలింగ్ పరిమితి పెంచడంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్ పాల్గొన్నారు.

గడువులోగా పెండింగ్ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఇసాక్‌బాషా, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 2014 నుంచి అస్యూరెన్స్‌కు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని లెజిస్లేటివ్ కౌన్సిల్ కమిటీ చైర్మన్ ఇసాక్‌బాషా అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. వెలుగోడు రిజర్వాయర్ పురోగతి, గతంలో ఇచ్చిన హామీల అమలు ఎంత వరకు జరిగిందనే అంశాలపై చర్చించారు. మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలో షాదీఖానాల నిర్మాణం, దుల్హాన్ స్కీం నిధుల విడుదల ఎలా జరుగుతున్నదీ తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న దేవాలయాలు, పునర్నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు సభ్యులు శ్రీనివాస్, రామచంద్రరెడ్డి, జాయింట్ సెక్రెటరీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

48 గంటల్లో ఉపాధి జాబ్ కార్డు

- పీడీ వెంకటరమణయ్య



జాబ్‌కార్డు నమూనా

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగియడంతో గ్రామాల్లోని రైతులు, కూలీలు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ పథకం కింద పనులు చేయాలంటే తప్పనిసరిగా జాబ్ కార్డు ఉండాలని షరతు విధించడంతో రైతులు, కూలీలు ఇప్పటిదాకా జాబ్‌కార్డు పొందేందుకు వారాలు, నెలల తరబడి అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకంది. వారం కింద కేంద్ర ప్రభుత్వం జాబ్‌కార్డులు పొందేందుకు కేవలం 48 గంటల కాలపరిమితిని మాత్రమే గడువు విధిస్తూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలు ఊరట చెందుతున్నారు. జాబ్‌కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు నమోదుకు సైతం ఇబ్బందులు ఉండేవి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఈకేవైసీ అమలుకు శ్రీకారం చుట్టడంతో అర్హులైన రైతులకు కేవలం 48 గంటల్లోనే ఉచితంగా కొత్త జాబ్‌కార్డు అందించేందుకు మార్గం సుగమమైంది. గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి దరఖాస్తులు సమర్పిస్తే మండల కార్యాలయం నుంచి మరుసటి రోజుకే జాబ్‌కార్డు నకలు అందించేందుకు నీటి యాజమాన్య సంస్థ చర్యలు తీసుకోనున్నారు. అదేవిదంగా సభ్యుల పేర్లు, నమోదు, చిరునామా చేర్పులు, మార్పులకు సైతం ఆదేశాలు అందాయని, గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కూలీలకు ఈ విధానం కొత్తకార్డులు తీసుకునేందుకు మంచి అవకాశమని నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటరమణయ్య గురువారం తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు

నంద్యాల టౌన్ డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం రోడ్డు వద్ద బుధవారం వైసీపీ నాయకుడు, ఎంపీటీసీ హరినాథరెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనలో నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ముసుగు వేసుకుని వచ్చి తన భర్త మీద దాడి చేసినట్లు బాధితుడి భార్య కమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాలుకా పోలీసులు గురువారం విచారించారు. అదే గ్రామానికి చెందిన రాజేశ్, తులసిరెడ్డి, నాగేశ్వరరెడ్డితో పాటు మరో ఐదుగురుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ ఈశ్వరయ్య తెలిపారు.



ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు సూచించారు. గురువారం సి.బెళగల్‌లో వాహనదారులకు స్వయంగా హెల్మెట్ ధరింపజేశారు. కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనం నడపాలన్నారు. మద్యం తాగి నడిపితే వాహనం సీజ్ చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మొదటిసారి జరిమానాతో పాటు, కేసు నమోదు చేస్తామని, రెండోసారి పట్టుబడితే వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. - సి.బెళగల్



నగరంలోని కిసాన్ ఘాట్ మీదుగా స్విమ్మింగ్ ఫూల్‌కు వెళ్లే దారి కంకర తేలడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన తుఫాన్ ప్రభావంతో రోడ్డు కంకర తేలి గుంతలమయంగా మారింది. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కంకర వేసి చేతులు దులుపుకున్నారు. రాజ్‌విహార్‌కు వెళ్లకుండా కొత్తబస్టాండుకు త్వరగా వెళ్లడానికి ఈ దారి ఉపయోగకరంగా ఉంది. అయితే కంకర వల్ల దుమ్ము, ధూళితో అవస్థలు పడుతున్నామని, సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు. - కర్నూలు హాస్పిటల్

ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): 28వ ఆంధ్ర ఎన్‌సీసీ బెటాలియన్‌లో బాలికల క్యాడెట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ శశికుమార్ తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన జీతం రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. డిగ్రీ అర్హతతో పాటు ఎన్‌సీసీ సర్టిఫికెట్ కలిగిన అవివాహిత మహిళలు 25 సంవత్సరంలోపు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7వ తేదీలోపు 28వ ఆంధ్ర ఎన్‌సీసీ బెటాలియన్, డాక్టర్స్ కాలనీ, బి.క్యాంప్ చిరునామాకు ధరఖాస్తు పంపాలని, 8వ తేదీ ఉదయం ఇంటర్వ్యు ఉంటుందని తెలిపారు.

మాజీ సీఎం రోశయ్యకు నివాళి



రోశయ్యకు నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం రోశయ్య మేటి నాయకుడని కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా 15 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న, బజారన్న, సయ్యద్ ఖాద్రీ, షేక్ ఖాజా హుస్సేన్, దామోదరం రాధకృష్ణ, రేపల్లె ప్రతాప్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు



తోటను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు

సి.బెళగల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు చేస్తే లాభాలు వస్తాయని ఉద్యానవనశాఖ శాస్త్రవేత్త మదన్‌మోహన్ అన్నారు. గురువారం పోలకల్లు, సంగాల గ్రామాల రైతులు పులిరాజు, వెంకటేశ్వర్లు సాగుచేసిన తోటలను పరిశీలించారు. చిన్న, సన్నకారు రైతులకోసం ప్రభుత్వం సబ్సిడీతో మంజూ చేస్తుందన్నారు. అయిల్‌పామ్‌ను చౌడు భూముల్లో కూడా పెంచవచ్చన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10,500 అందజేస్తుందన్నారు. క్షేత్రస్థాయి పరిశీలకులు లలిత, శశికాంత్, దేవ ఉన్నారు.

నిధులున్నా అభివృద్ధి లేని గూడూరు

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీకి నిధులున్నా గూడూరు అభివృద్ధికి నోచుకోలేదని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు కేవీ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గూడూరులో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జె.మోహన్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. 2011లో గూడూరును నగర పంచాయతీగా మార్చి, ప్రజలపై పన్నుభారం మోపడం తప్ప ఎక్కడా కనీస సౌకర్యాలు కల్పించలేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా స్పందించి నగర పంచాయతీని అభివృద్ధి చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రాజశేఖర్, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, రామాంజనేయులు, మాదవకృష్ణయ్య, దానమన్న, మధు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంపై హర్షం



సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకరం చేస్తున్న దివ్యాంగులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంపై సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహించారు. 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం వేడుకల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. టీడీపీ ఎన్నికల ముందు ఇచ్చిన హమీలు అమలు చేయడంతో ఉపశమనం పొందారని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, ఇళ్ల నిర్మాణాలు, సబ్సిడి రుణాలు ఇప్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, సురేష్ మక్బూల్ బాషా, మద్దమ్మ, పోల్కల్ సురేష్ పాల్గొన్నారు.

క్రీడలతో సత్సంబంధాలు

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో సత్సంబంధాలు ఏర్పడతాయని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. గురువారం అవుట్‌డోర్ స్టేడియంలో 44వ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ మీట్ అండ్ సెలక్షన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీజీ మాట్లాడుతూ తనకు క్రీడల పట్ల ఆసక్తి ఉందని, అందుకే ప్రోత్సాహిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా క్రీడల అభివృద్ధికి గానూ ప్రతి మండలంలో ఒక స్టేడియం నిర్మాణానికి నాటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డిని ఒప్పించానన్నారు. నగరంలో ప్రతి వార్డులో మినీ ఇండోర్ స్టేడియం నిర్మించే దిశగా ప్రయత్నించి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. గత ప్రభుత్వం వాటిని ప్రభుత్వ కార్యాలయాలుగా మార్చిందన్నారు. వాకర్స్‌కు కేసీ కెనాల్ పొడవునా, తుంగభద్ర నది తీరాన ట్రాక్ నిర్మించామన్నారు. నగరంలో క్రీడల అభివృద్ధికి ఏపీఎస్‌పీ బెటాలియన్‌లో అవుట్‌డోర్ స్టేడియం, పంచలింగాలో రాయలసీమ యూనివర్సిటీలలో ఇండోర్ స్టేడియాలను సొంత నిధులతో నిర్మించినట్లు ఆయన తెలిపారు. మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన వారిని సన్మానించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి, డీఎస్‌డీవో భూపతిరావు, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, రామచంద్రారెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు

నేడు గని గ్రామంలో సైరా నరసింహారెడ్డి నాటకం

గడివేముల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గడివేముల మండలంలోని గని గ్రామంలో అవధూత కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో శుక్రవారం కర్నూలు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సై.సైరా నరసింహారెడ్డి చారిత్రాత్మక పద్యనాటకం ప్రదర్శన ఉంటుందని అధ్యక్షులు, కళారత్న పత్తి ఓబులయ్య వెల్లడించారు. టీజీవీ కళాక్షేత్రం, బుడ్డా వెంగళరెడ్డి కళావేదిక సంయుక్తంగా సమర్పిస్తున్న ఈ నాటక ప్రదర్శన రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. నాటక అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి నాటకాన్ని తిలకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పల్లేటి కులశేఖర్ రచించిన ఈ నాటకానికి పత్తి ఓబులయ్య దర్శకత్వం వహిస్తున్నారని కార్యక్రమ కన్వీనర్ కేవీ రమణ తెలిపారు.

విద్యాసాగర్‌కు సన్మానం

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌ను నంద్యాలలో ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు కలిశారు. గురువారం సమావేశానికి వచ్చిన సందర్భంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మోహన్‌రావు మహ్మద్ హుస్సేన, సామేల్ ఉన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బీసీ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న 384 గ్రేడ్-2 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కటారుకొండ సాయి కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 743 బాలురు, 367 బాలికల హాస్టల్స్ ఉన్నాయని, విద్యార్థులు అరకొర సౌకర్యాలతో కాలం వెల్లబూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వాల్మీకి భవన్ నిర్మించాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో వాల్మీకి భవన్ నిర్మించాలని వివిధ సంఘాల నాయకులు కోరారు. శాలివాహన, నాయీ బ్రాహ్మణ, వాల్మీకి బోయ, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ల డైరెక్టర్లు సుబ్బయ్య, విజయ్ కుమార్, మంజునాథ్, మురళి, మహేష్ నాయుడు జేసీకి వినతి పత్రం అందజేశారు.

పౌరులు బాధ్యతగా వ్యవహరించాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర పరిశుభ్రత, రహదారి భద్రత, జంతు నియంత్ర అంశాల్లో పౌరులు బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. కుక్కల బెడద నివారణకు సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అనుసరించి నగర పాలక సంస్థ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో జంతు నియంత్రణ-పరిశుభ్రత చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. దామోదరం సంజీవయ్య స్మారక నగర పాలక ఉన్నత పాఠశాల పరిసరాల్లో సంచరిస్తున్న కుక్కలను పట్టుకుని తరలించామన్నారు. అలాగే సీతారామ్‌నగర్ పరిసరాల్లో రహదారిపై ఉనన పశువులను గుర్తించి ఎల్‌ఐసీ పార్కుకు తరలించామన్నారు. నిర్మల్‌నగర్‌లో ప్రైవేటు ఖాళీ స్థలాలను గుర్తించి శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పశువులను రహదారులపై వదిలేస్తే గోశాలకు తరలించి జరిమానా విధిస్తామని, చెల్లించకపోతే యాజమాన్య హక్కులు రద్దు చేస్తామని హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్ నిర్వాహకులు ఆహార వ్యర్థాల ను బహిరంగ ప్రదేశాల్లో పారవేయొద్దన్నారు.

మత్తు పదార్థాల విక్రేతలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యువతకు మత్తు పదార్థాల విక్రేతలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీని వాసులు డిమాండ్ చేశారు. గురు వారం సీఆర్ భవన్‌లో మాట్లాడు తూ వైసీపీ ప్రభుత్వ హయాంలో గంజాయి, డ్రగ్స్ మత్తుపదార్థాలు విచ్చలవిడిగా రవాణా చేశారన్నారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారి అరాచ కాలు చేస్తున్నారన్నారు. అధికారం లోకి వచ్చిన వంద రోజుల్లో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారని విమర్శించారు. శ్రీరాములు నగర నాగరాజు, బీసన్న, చంటి, శివ, అఖిల్, దస్తగిరి పాల్గొన్నారు.

పాటకు ఖ్యాతి తెచ్చిన ఘంటసాల



నివాళి అర్పిస్తున్న వైద్యులు సీతారాం, శంకరశర్మ

కర్నూలు కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సినీ గాయకుడు పాటకు ఖ్యాతి తెచ్చారని వక్తలు కొనియాడారు. గురువారం నగరంలోని ఆయకర్ భవన్ వద్ద ఘంటసాల విగ్రహానికి, ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు వాసుదేవమూర్తి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. వైద్యులు డబ్ల్యూ సీతారాం, బి. శంకరశర్మ, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కేసీ కల్కూర, శ్రీశైలం ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, మధురకవి ఎలమర్తి రమణయ్య, గాయకుడు శ్రీనివాస్ మాట్లాడారు. ఘంటసాల స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలుకు వెళ్లి వచ్చారన్నారు. ప్రతినిధులు రాఘవేంద్ర ప్రసాద్, జగన్నాథ గుప్త, శ్రీరాముడు, సత్యప్రసాద్, ఇనాయతుల్లా పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం

● ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆర్‌యూ ఉపకులపతి



మాట్లాడుతున్న ఉపకులపతి వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు భవిష్యత్ ఇవ్వడమే లక్ష్యమని ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. గురువారం వర్సిటీలోని ఆడిటోరియంలో పీజీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే నిర్వహంచారు. రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ లతో కలిసి హజరయ్యారు. సీనియర్లు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకులుగా మసలుకోవాలన్నారు. గ్రామాల నుంచి ఉన్నత చదువుల కోసం వర్సిటీకి వస్తున్నారని ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షిస్తామని పెర్కొన్నారు. ప్రిన్సిపాళ్లు వెంకట సుందరానందపుచ్ఛా, విశ్వనాథరెడ్డి, భరత్ కుమార్, సీవీ కృష్ణారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

కనీస వేతనాన్ని అమలు చేయాలి



వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌ఎంటీలకు ఉద్యోగ భద్రతతో పాటు మినిమం టైం స్కేలును అమలు చేయాలని ఉద్యోగులు దస్తగిరి, మహబూబ్ బాషా, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా అర్హతలను దృష్టిలో ఉంచుకుని రూ.44,570ల కనీసం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులకు వరాలు ప్రకటించడం పట్ల ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆ సంఘాల నాలయకులు రామాంజనే యులు, ఎం.మనోహర్, బొగ్గుల అభిలాష్, కె.లక్ష్మినారాయణ, చాంద్‌బాషా, చిన్న వెంకటేశ్వరు పాల్గొన్నారు.

రన్నర్‌గా కేఎంసీ ఫుట్‌బాల్ టీం



ఫుట్‌బాల్ క్రీడాకారులతో ప్రిన్సిపాల్, స్పోర్ట్స్ కమిటీ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కర్నూలు మెడికల్ కాలేజీ టీమ్ రన్నర్‌గా నిలిచింది. 27వ మెడికల్, డెంటల్ అంతర్ కళాశాల పోటీల ఫైనల్‌లో కేఎంసీ 1-0 గోల్స్ తేడాతో ఓడిపోయింది. కర్నూలుకు వచ్చిన క్రీడాకారులు గురువారం ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మను కలిశారు. వైద్య విద్యార్థులు క్రీడల్లో రాణించడం పట్ల ప్రిన్సిపాల్ పీడీ రామకృష్ణ స్పోర్ట్స్ కమిటి వైస్ చైర్మన్ డా.విద్యాసాగర్‌ను అభినందించారు. మెడిసిన్ హెచ్‌వోడీ మెన్స్ కాలేజీ హాస్టల్ చీఫ్ వార్డెన్ డా.డి.శ్రీరాములు, సభ్యులు డా.విజయశంకర్, డా.సోమశేఖర్, డా.విజయ్‌బాబు, డా.ప్రవీణ్ పాల్గొన్నారు.

జనవరి 19 నుంచి బ్రహ్మోత్సవాలు



కరపత్రాలు విడుదల చేస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్ తుంగభద్ర నదీ తీరాన హరిహర క్షేత్రంలో జనవరి 19 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ తెలిపారు. గురువారం నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరపత్రాలు విడుదల చేశారు. 20 ఏళ్లుగా వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, సీవీ దుర్గాప్రసాద్, సముద్రాల శ్రీధర్, కంచుగంటల శ్యామసుందర్‌రావు, నాగులవరం రాజశేఖర్ పాల్గొన్నారు.

23న డాక్ అదాలత్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తపాల సేవలపై ఈనెల 23న 'డాక్ అదాలత్' నిర్వహిస్తున్నట్లు డివిజనల్ పోస్టల్ సూపరింటేండెంట్ జి.జనార్దనరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. పాతబస్టాండు వద్ద ప్రధాన తపాలా కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. పోస్టాఫీసు సేవలపై సమస్యలున్న వారు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దనరెడ్డి, కర్నూలు డివిజనల్ కార్యాలయం, పాతబస్టాండు చిరునామాకు ఈ నెల 15వ తేదీలోగా పోస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో దత్తజయంతి



అక్షింతలు స్వీకరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి



సాయిబాబా ఆలయంలో సంకీర్తన చేస్తున్న సభ్యులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర వ్యాప్తంగా బుధవారం గురు దత్తజయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయుడి స్వరూపంగా షిరిడీ సాయి బాబాను భక్తులు పూజించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న సాయిబాబా దేవాలయాలు, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతనగరంలో షిరిడీ సాయిబాబా దేవస్థానంలో జరిగిన దత్తజయంతి వేడుకల్లో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ వేడుకలకు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి, ఇతర న్యాయాధికారులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎస్వీ విజయమనోహరి పాల్గొన్నారు. సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కేసీ కెనాల్ వినాయక ఘాట్ సమీపంలోని వినాయక మందిరంలోగల సత్యసాయి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్‌జీ మహాబలేశ్వర్ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శివదత్త సాయిమందిరంలో పూజలు నిర్వహించారు.

ప్రముఖ సైకాలజిస్టు, హిప్నోథెరపిస్టు డాక్టర్ సిరిగిరెడ్డి జయారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు టీవీ మల్లికార్జునరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వెంకటరమణ కాలనీలోని సత్యసాయి మందిరం, అశోక్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి, ద్వారకామాయి సాయిమందిరంలో దత్త జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎ.క్యాంపులోని ఆదిత్యనగర్‌లోని సాయి సుబ్రహ్మణ్యేశ్వర జ్ఞాన మందిరంలో గురు దత్తజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తల్లంసుబ్బ విజయకుమార్, అధ్యక్షుడు బేతంశెట్టి లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శి కేవీ అనిల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేటలోని నాగసాయి దేవాలయంలో దత్తాత్రేయ జయంతిని వైభవంగా నిర్వహించారు.

ఉధృతమవుతున్న ఉద్యమం

- ఆదోనిని జిల్లా చేయాలని కొనసాగుతున్న దీక్షలు
- అయోమయంలో ప్రజలు
- పెద్దహరివాణం మండలం వద్దంటూ వివిధ గ్రామాల ఆందోళన
- పెద్దతుంబళం మండలం చేయాలంటూ గ్రామం బంద్

ఆదోని రూరల్/ ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం రోజు రోజుకూ రగులుతోంది... రెండో ముంబాయిగా పిలువబడే ఆదోనికి అన్ని అర్హతలుండి పశ్చిమ ప్రాంతంలో అత్యంత వెనుకబడి అభివృద్ధికి నోచుకోని ఆదోనిని జిల్లా చేయాలని విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు ముందుకొచ్చి రోజు దీక్షలు చేస్తున్నారు. దీంతో ఆదోని ప్రజలు తీవ్ర అయోమయానికి గురి కావాల్సి వస్తుంది. ఆదోని మండలంలో ఇంత రచ్చ జరుగుతున్న ఆయా పార్టీల రాజకీయ నాయకులు మౌనం వీడడం లేదు. . పెద్దహరివాణ మండలం మాకొద్దంటూ గ్రామాలకు గ్రామాలు ఆందోళన చేస్తూ, రహదార్లను దిగ్బంధం చేస్తున్నాయి... అన్ని అర్హతలున్న పెద్దతుంబళాన్ని ఎందుకు మండలం చేయడం లేదంటూ, ఆ గ్రామ ప్రజలు ఆందోళనబాట పట్టి స్వచ్ఛందంగా నిరసనలకు దిగుతున్నారు.

● పశ్చిమ ప్రాంత ఐదు నియోజకవర్గ పల్లెలు సమాగ్రాభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లాతోనే సాధ్యమని జిల్లా సాధన సమితి జేఏసీ నాయకురాలు న్యాయవాది లలిత జితేంద్ర, రఘురామయ్య, కృష్ణమూర్తి గౌడ్, అశోక నందారెడ్డి, కుంకనూరు వీరేష్, తిరుమలేష్ అన్నారు. ఆదోని జిల్లా సాధన సమితి జేఏసీ ఆధ్వర్యంలో కోట్ల కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు గురువారంకు 19వ రోజుకు చేరుకున్నాయి. ఆదోని జిల్లా సాధన కోసం మేము సైతం అంటూ చేతివృత్తుదారులైన మేధారి సంఘం నాయకులు దీక్ష శిబిరంలో ప్రత్యేకంగా పందిరిలా అలంకరించి దీక్షలో కూర్చున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, మహిళ సంఘం నాయకురాలు సుజ్ఞానమ్మ, ఉద్యోగులు ఎల్ఐసీ ఏజెంట్లు సంఘీభావం తెలిపారు. దీక్షలో రామకృష్ణ రాజు, తిరుమలేశు, నాగరాజు, నర్సప్ప, ఈశ్వరయ్య, శివ పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న చేతి వృత్తిదారులైన మేదరి సంఘం నాయకులు

మదిరె క్రాస్ వద్ద రాస్తారోకో

ఆదోని మండలం మదిరె క్రాస్ వద్ద చిన్నహరివాణం, మదరె, చిన్న గొనేహళ్ గ్రామస్థులు వివిధపార్టీల రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో మదిరె క్రాస్ వద్ద చేరుకొని గురువారం ఆదోని - శిరుగుప్ప ప్రధాన రహదారిపై రెండు గంటలపాటు బైఠాయించారు. నాయకులు గోపాల్‌రెడ్డి, రామస్వామి, మదిరె భాస్కర్ రెడ్డి, మదిరె సర్పంచ్ నారాయణ, చిన్నహరివాణం సర్పంచ్ రామకృష్ణారెడ్డి, సీపీఐ నాయకులు మల్లికార్జున, మహిళా సమాఖ్య నాయకురాలు మణి, సునందమ్మ పాల్గొన్నారు.

మధ్యలో కర్ణాటక గ్రామం ఉంది?

నూతనంగా పెద్దహరివాణం గ్రామాన్ని మండలం చేస్తూ, చాగి, మదిరె, నారాయణపురం, బసాపురం, ఢణాపురం, గణేకల్లు, చిన్నహరివాణం, కడితోట గ్రామాలతోపాటు ఆదోనికి దగ్గరగా ఉన్న మరికొన్ని గ్రామాలను పెద్దహరివాణంలో కలపడం సిగ్గుచేటని మదిరె సర్పంచ్ నారాయణ, చిన్నహరివాణం సర్పంచు రామకృష్ణారెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పెద్దహరివాణం - సంతేకుడ్లూరు మధ్యన ఏ గ్రామం ఉందో అది ఏ రాష్ట్రానిదో తెలుసుకోవాల్సిన అవసరం అధికారులకులేదా అని వారు ప్రశ్నించారు.



పెద్దతుంబళంలో ఆందోళన చేపడుతున్న దృశ్యాలు

పెద్దతుంబళం మండలం చేయాల్సిందే

ఆదోని మండలంలో అతీ పెద్ద గ్రామం పెద్దతుంబళం గ్రామమని, తమ గ్రామాన్ని ఎందుకు ప్రభుత్వం మండలంగా ప్రకటించలేదని ఆ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

మీనాక్షి నాయుడుకు వినతి

ఆదోనికి చాగి, బసాపురం,నారాయణపురం, మదిరె, ఢణాపురం, గణేకల్, కడితోట గ్రామాలు దగ్గర అని, ఈ గ్రామాలను పెద్దహరివాణంలో కలపడం అన్యాయమని, తక్షణమే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేయాలని నాయకులు గోపాల్‌రెడ్డి, రామస్వామి, వీరేష్, మల్లికార్జున, మహబూబ్‌బాష మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. 16గ్రామాల నుంచి ఇద్దరు చొప్పున అందరిని సీఎం వద్దకు తీసుకెళ్తానని మీనాక్షి నాయుడు వారికి సూచించారు.

సమన్వయంతో పని చేయాలి

ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు



నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పత్తికొండ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభ్యున్నతికి అధికారులు సమన్వయంతో పని చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం డివిజన్ కేంద్రమైన పత్తికొండ పట్టణంలో గ్రామ సచివాలయం-2లో నూతన డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసు (డీడీఓ) కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ భరత్‌నాయక్, ఎంపీడీఓ కవిత, డీఈ శేషయ్య, ఏఈ వెంకటేష్, ఏపీఓ వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, తిమ్మయ్యచౌదరి, మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కొమ్ము దీపిక, నాయకులు తిరుపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

● జీసీడీవో స్నేహలత

హాలహర్వి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో పిల్లలకు నాణ్యమైన విద్యా అందించాలని జీసీడీవో స్నేహలత అన్నారు. గురువారం హాలహర్విలోని కస్తూరిబా పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పేద పిల్లలకు విద్యతో పాటు స్వయం ఉపాధి వైపు దృష్టి మళ్లించాలన్నారు. విద్య నేర్చుకున్న తర్వాత పల్లెల్లో స్వయం ఉపాధితో జీవించేలా వారిని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వేదవతి ప్రాజెక్టు అవసరంపై ప్రభుత్వానికి విన్నవించా

● ఎమ్మెల్యే రామాంజినేయులు

ఆలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో వేదవతి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని పబ్లిక్, అకౌంట్ కమిటీ సమావేశంలో కోరినట్లు ఆలూరుకు చెందిన గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజినేయులు గురువారం తెలిపారు. ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలకు సంబంధించి తాగునీటితో పాటు 80 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ నత్తనడకన సాగడంపై వివరించినట్లు తెలిపారు. కమిటీ సానుకూలంగా స్పందించి ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ప్రమాదాల నివారణకు సూచిక బోర్డుల ఏర్పాటు



ప్రమాద సూచికబోర్డులను ఏర్పాటు చేస్తున్న తాలుకా ఎస్ఐ

ఆదోని రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణ కోసం రోడ్లకిరువైపులా ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తాలుకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆరేకల్లు సమీపంలోని మలుపురోడ్ల వద్ద ఇరువైపులా బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ, ప్రమాదాల నివారణ డ్రైవర్లతోనే సాధ్యమని, మద్యం సేవించి వాహనాలను నడపవద్దన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

● డిప్యూటీ ఈవో రాజేంద్ర ప్రసాద్

ఆదోని అగ్రికల్చర్ , డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని ఆదోని డిప్యూటీ ఈవో రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో దాత నాగరాజు స్వామి ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి త్రోబాల్ టోర్నమెంట్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ ఈవో రాజేంద్రప్రసాద్ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం శారీరక దృఢత్వాన్ని ఇస్తాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, ఫయాజ్, గిరి, కేశవయ్య, ఉపాధ్యాయులు వీర చంద్ర పాల్గొన్నారు.

అరెస్టు చేయాలి

చిప్పగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హాలహర్వి మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతిపై దాడి చేసిన ఆలూరు మార్కెట్‌యార్డు డైరెక్టర్, టీడీపీ నాయకులు బండారి మారుతిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ గురువారం చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ రవిశంకర్‌రెడ్డిలను కలిసి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ముత్యాల గాదిలింగ కోరారు. భీమ, ఉచ్చురంగ పాల్గొన్నారు.

గ్రేడింగ్ విధానాన్ని ఎత్తేయాలి

ఆదోని అగ్రికల్చర్ , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ దిగుబడులకు రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్న గ్రేడింగ్ విధానాన్ని పూర్తిగా ఎత్తివేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గ్రేడింగ్ విధానం ఎక్కడ లేదని ఆదోనిలో మాత్రమే కొనసాగుతుందని అన్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు



మద్దికెరలో దత్తాత్రేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మద్దికెర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో గురు దత్తాత్రేయస్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. గురువారం సాయిబాబా దేవాలయంలో వెలసిన మూలవిరాట్ దత్తాత్రేయ స్వామికి పూజలను ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామాంజినేయులు, మల్లికార్జున, టైలర్ హరి, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణంలోని సాయిబాబా ఆలయంలో గురువారం దత్త జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ నిర్వాహకులు రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కుమ్మరి వీధిలో పౌర్ణమిని పురస్కరించుకుని పెద్దమ్మవ్వకు ప్రత్యేక పూజలు చేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేపట్టారు.

ఆలూరు రూరల్: దత్తాత్రేయస్వామి జయంతి వేడుకలు గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని ఆలూరులోని షిర్డీ సాయిబాబా మందిరం, మొలగవల్లిలోని భోగేశ్వరస్వామి సహిత మాణిక్యప్రభు దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో దత్తాత్రేయస్వామి వారిని అలంకరణ చేశారు.

మండలాల అభివృద్ధికి కృషి చేయాలి

● డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

ఆదోని రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. వర్చువల్‌గా డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలను చిత్తూరు నుంచి గురువారం ఆయన ప్రారంభించారు డిఎల్‌పిఓ తిమ్మక్క, ఎంపిడిఓ నాగరాజు స్వామి, డిఈ రంగస్వామి, ఎఈ మాలిక్, ఏపిఓ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఆలూరు అభివృద్ధి చేద్దాం

టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



జనసేన నాయకులతో మాట్లాడుతన్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దామని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి కోరారు. గురువారం జనసేన ఇన్‌చార్జి వెంకప్పతో కలిసి చర్చించారు. రైతులకు తాగు, సాగునీరు అందించి, రహదారులు బాగు చేద్దామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సారథ్యంలో అభివృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతుందన్నారు. సమావేశంలో ఆదోని జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, టీడీపీ నాయకులు వైకుంఠం శివప్రసాద్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆస్పరిలో నేడు ప్రజాదర్బార్

ఆస్పరి అంబేడ్కర్ కూడలిలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి గురువారం తెలిపారు.

వైకుంఠం జ్యోతి సీరియస్

దేవనకొండ: మండలంలో పలు గ్రామాలలో ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తామంటూ డబ్బులు వసూలకు పాల్పడుతున్నారు.ఇళ్ల మంజూరుకి లబ్ధిదారుల నుండి రూ. 4 వేల వసూలకు పాల్పడుతున్నారని .మండలంలోని ఓగ్రామంలో ఇళ్లు, పింఛన్లు పేరిట నాయకుడు వసూలకు పాల్పడటంతో, అదే గ్రామానికి చెందిన వ్యక్తులు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వైకుంఠం జ్యోతి ఏదుటనే ఆ నాయకుని నీలదీశారు. ఇలాంటి పనులు చేస్తే సహించేది లేదని సదరునాయకుని హెచ్చరించిన్నట్లు సమాచారం.

3 సెంట్ల స్థలం కేటాయింపు

క్రిష్ణగిరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రిష్ణగిరిలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వికలాంగుల భవనానికి 3 సెంట్ల స్థలాన్ని పత్తికొండ మార్కెట్‌యార్డు చైర్మన్ ఆలంకొండ నబి, మర్రి శ్రీరాములు, మండల అధ్యక్షుడు దామోదర్‌నాయుడుల సమక్షంలో వికలాంగ సంస్థకు అందజేశారు. గురుస్వామి, మహమ్మద్ రఫీ, తిప్పన్న పాల్గొన్నారు.

రమణీయం.. మునిరంగ స్వామి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు
- రథోత్సవానికి హాజరైన అశేషజనవాహిని

తుగ్గలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఇలవేల్పు శ్రీ మునిరంగ స్వామి, పక్కీరప్ప స్వాముల కళ్యాణం కమీనయంగా.. రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గురువారం లింగనాయునిదొడ్డి గ్రామ శివారులో వెలసిన మునిరంగస్వామి, భూదేవి శ్రీదేవి అమ్మవార్లకు ఉదయం అర్చకుల వేద మంత్రోచ్ఛరణాలు,, మంగళవాయిద్యాల కళ్యాణోత్సవం నిర్వహించారు. తుగ్గలి ఎస్ఐ బాలనరసింహులు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు, తలారి రాముడు, దేవేంద్ర, వెంకట్రాముడు, మోహన్, ప్రతాప్ యాదవ్, భక్తులు పాల్గొన్నారు.

పోటీలు రైతుల్లో ఉత్సాహం నింపుతాయి: ఎమ్మెల్యే

● రైతులకు ఇష్టమైన పల్లెలో రాతిదూలం పోటీలు నిర్వహించడంతో.. రైతుల్లో ఉత్సాహం నింపుతుందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం లింగనాయునిదొడ్డి గ్రామ సమీపంలో గౌతమ మహాముని కొండలో గౌతమ మహాముని రంగస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాతిదూలం పోటీలను ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రారంభించారు. రాతి దూలం పోటీలతో రైతుల్లో స్నేహ స్వభావం పెరిగి వ్యవసాయంపై మక్కువ పెరుగుతుందన్నారు. తుగ్గలి నాగేంద్ర, మనోహర్ చౌదరి, సాంబశివారెడ్డి, రాముడు, దేవేంద్ర, వెంకట్రాముడు, మోహన్, చిన్నమాబు, రామారావు ఉన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్

వెల్దుర్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తి జాతీయరహదారి-44లో ఉన్న విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ప్రత్యేక విద్యుత్తు లోక్‌అదాలత్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఇంచార్జీ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు పట్టణం, కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల విద్యుత్ వినియోగదారులు హాజరై సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

హాస్టల్‌ను పునఃప్రారంభించండి

దేవనకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవనకొండలో బీసీ హస్టల్‌ని తిరిగి పునః ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. హాస్టల్‌తోపాటు మోడల్ స్కూల్‌ను నిర్మించాలన్నారు. మండల కార్యదర్శి భాస్కర్, హరి, అక్బర్, పురుషోత్తం, శీను, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులకు పరిహారం ఎప్పుడు?

మద్దికెర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది వ్యవసాయ పొలాల్లో, తోటల్లో సాగు చేసి నష్టపోయిన ఉల్లి రైతులకు పరిహారం ఎప్పుడు ఇస్తారనీ మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కోదండరాముడు ప్రశ్నించారు. రైతులకు ప్రభుత్వం హెక్టారుకు రూ.50వేలు ఇస్తామని ప్రకటించిందని, ఇంత వరకు ఎందుకు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు పంట నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాధికారి రవి మాట్లాడుతూ జిల్లా అధికారులకు నివేదికలు పంపామని, పరిహారం మంజూరైన వెంటనే వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు.

బిల్లుల మంజూరులో జాప్యం తగదు

పత్తికొండ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోషల్ ఫారెస్ట్ పరిధిలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి చెట్లను పెంచే కూలీ పనులు చేపట్టి, ఏడేళ్ల గడుస్తున్నా, లక్షల్లో బిల్లులు మంజూరు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని, అప్పుల్లో కూరుకుపోయిన తమకు బకాయి బిల్లులు చెల్లించి పుణ్యం కట్టుకోవాలంటూ బాధితులు ఎదుట మొరపెట్టుకున్న ఘటన పత్తికొండలో గురువారం చోటు చేసుకుంది.బాధితుల పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ఫారెస్ట్ రేంజర్ అధికారి శ్రీనివాసులను వివరణ కోరగా, మా పరిధిలో వారికి ఎటువంటి పెండింగ్ బిల్లులు చెల్లింపులు ఏమీ లేవని, కేవలం వారు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

వెల్దుర్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాణ్యం నుంచి వెల్దుర్తికి వస్తున్న గడ్డి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. మండలంలో బ్రహ్మగుండం సమీపాన ఎర్రచెరువు క్రాస్‌లో జరిగిన ఈ ఘటనలో ట్రాక్టరు ఇంజన్, టాలీ బోల్తాపడ్డాయి. డ్రైవర్ రాజు సురక్షితంగా బయటపడ్డాడు. బోల్తాపడిన ట్రాక్టరును ఎక్స్‌కవేటర్ సహాయంతో రోడ్డుపై నుంచి తీసివేశారు. గడ్డిని వేరే ట్రాక్టరులోకి మార్పుచేసి తరలించారు.

విద్యను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్

- విద్య, ఉపాధి లేక వలసబాట పట్టిన పశ్చిమ ప్రాంతం
- ఎస్ఎఫ్ఐ జిల్లా 50వ స్వర్ణోత్సవ మహాసభలో వక్తలు

ఆలూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నూతన విద్యావిధానంతో విద్య ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా 50 స్వర్ణోత్సవ మహాసభలు ఆలూరులో జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్ అధ్యక్షతన విద్యార్థులతో కలిసి ఆలూరులో భారీ ప్రదర్శన చేపట్టారు. పాత బస్టాండులో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్, కేంద్ర కమిటీ సభ్యులు పరమేష్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై నిత్యం అనేక పోరాటాలు చేస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తన్నామన్నారు. ఈ మహాసభలలో జిల్లా విద్యారంగం, విద్యార్థుల సమస్యలపై మహాసభలలో తీర్మానం చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రంగప్ప, ఆనంద్‌బాబు, మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సంయుక్త, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు మైన, పాల్గొన్నారు.

సీఆర్ఎంటీలను విద్యాశాఖలో విలీనం చేయాలి

మద్దికెర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండల రీసోర్స్ కార్యాలయంలో పనిచేస్తున్న పీఆర్ఎంటీ (క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్)ను విద్యాశాఖలో విలీనంచేసి రెగ్యులర్ చేయాలని పీఆర్ఎంటీలు ఆదిలక్ష్మి, మాదన్న కోరారు. గురువారం మండల విద్యాధికారి రంగస్వామికి పీఆర్ఎంటీల ఆత్మగౌరవ దీక్షకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. పీఆర్ఎంటీల సమస్యలు పరిష్కరించాలని ఆత్మగౌరవ దీక్ష చేపడుతున్నామన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేద్దాం

ఆదోని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవం చేయడానికి, రాజీ కాబడే పరిష్కార దశలో ఉండే ఎక్కువ కేసులను పరిష్కారమ య్యేలా చూడాలని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కోర్టులో డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో లోక్‌అదాలత్‌పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పీడీఎం అర్చన, ఫస్ట్ అడిషనల్ జడ్జి సుభాష్, సెకండ్ అడిషనల్ జడ్జి శ్రీవల్లి పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

వెల్దుర్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తి కొత్తబస్టాండ్ కాంప్లెక్సులో 'జనసేన' నూతన కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. జనసేన జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ నాయకల్లు బాబ్జీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభిచారు. బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తికొండ విద్యార్థుల అద్భుత ప్రదర్శన

పత్తికొండ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన 19వ జాతీయ జంబోరీలో పత్తికొండలోని ఏపీ మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు వరుణ్, సుమన్‌పరేడ్ మార్చ్ పాస్ట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచారు. ప్రతిభ కనబరి చిన తమ విద్యార్థులను పత్తికొండలోని ఏపీ మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ విక్టర్ శ్యాముల్, పీఈటీ రాజశేఖర్‌నాయక్‌లు అభినందనలు తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఆస్పరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని, డిసెంబర్ 10న ఆస్పరి చౌరస్తాలో చేపట్టే రోడ్డు దిగ్బంధనం జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయులు బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, శేఖర్, హనుమంతు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

పత్తికొండటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తికొండలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఈశ్వర్‌రెడ్డి భవన్ నుంచి సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు పట్టణంలో ర్యాలీ చేపట్టి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఆర్డీఓ అధికారులకు వినతి పత్రం అందించారు. దస్తగిరి, రవిచంద్ర, కాశన్న, కారప్ప, శిఖామణి, దుగ్గన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దేవనకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవనకొండ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికురాలు అంజలి (40) అనారోగ్యంతో మృతి చెందింది. సచివాలయాల డిప్యూటీఎంపీడీవో రఫీ, టీడీపీ నాయకులు ఆకుల వీరేష్, బండ్లయ్య, రాజాసాబ్ రూ.10వేల ఆర్థిక సహాయం మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. జనసేన నాయకులు కె.ఉచ్చీరప్ప రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు.

వాల్మీకినగర్‌లో పర్యటించిన అధికారులు



వాల్మీకి నగర్‌లో విచారిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 3వ వార్డు వాల్మీకి నగర్‌లో 'ప్రబలిన విష జ్వరాలు' అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి గురువారం అధికారులు స్పందించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, వైద్యులు ఇబ్రహీం, రాజ్‌కిరిటీ, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి ఆధ్వర్యంలో వాల్మీకి నగర్‌లో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బందిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులను సక్రమంగా నిర్వహించాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లను హెచ్చరించారు. డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి ఆధ్వర్యంలో మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బంది వాల్మీకినగర్‌లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలు శుభ్రం చేయించి తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు ట్రాక్టర్లలో తరలించారు. రెండు డెంగీ కేసులు నమోదు కావడంతో వాల్మీకి నగర్‌లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి శుభ్రం చేశారు. అనంతరం రాత్రి దోమల నివారణ కోసం పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి మాట్లాడుతూ వాల్మీకి నగర్ కాలనీవాసులకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించాలని, సబ్ సెంటర్‌లలో కాకుండా కాలనీలలో ఇంటింటికి తిరిగి వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

'లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఉద్యమించాలి'

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్ల రద్దు కోసం ప్రతి కార్మికుడు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు గోవిందు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తాలుకా కార్యదర్శి రాముడు, యు రమేష్, సురేష్, నాగలక్ష్మి, మంజుల, షబ్బీర్ పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ట్యాంకు విరాళం

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల పాఠశాలకు తాగునీటి ట్యాంకును విరాళంగా అందజేసినట్లు ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో సుమారు 3వేల మంది విద్యార్థినులు ఉన్నారని, తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీంతో 1000 లీటర్ల వాటర్ ట్యాంక్‌ను హెచ్ఎం కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోటప్ప, బసవరాజు, ప్రసన్నరాజు, సుజాత, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

నందవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్ల (సీఆర్ఎంటీ)కు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ.44,570 ఇవ్వాలని ఏపీ సీఆర్ఎంటీ యునైటెడ్ ఫోరం రాష్ట్ర నాయకుడు పుల్లన్న డిమాండ్ చేశారు. నందవరం ఎంఈవో కార్యాలయం ముందు మండల నాయకుడు ఉరుకుంద ఆధ్వర్యంలో గురువారం ఆత్మగౌరవ దీక్ష చేపట్టారు. ఈనెల 8న కలెక్టరేట్ వద్ద, 22న విజయవాడలో జరిగే ఆత్మగౌరవ దీక్షను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తహసీల్దారు శ్రీనివాసులు, ఎంఈవోలు రఘునాథ్, గోవిందుకు వినతిపత్రాలు అందజేశారు.అనిల్‌కుమార్, మహేశ్వరి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కోసిగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో పని చేస్తున్న సీఆర్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పించి సొంత మండలాల్లోనే కొనసాగించాలని కోసిగి చెందిన సీఆర్‌పీలు యోహాన్, హాశేనీ, అనంతరామ్ తెలిపారు. గురువారం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ పరశురామ్, శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. సీఆర్‌పీల సమస్యలపై ఈ నెల 8వ తేదీన ఛలో జిల్లా కలెక్టర్ల వద్ద ఆత్మగౌరవ దీక్ష చేపడుతున్నామనీ, ఈ నెల 22న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ



పాలసీ బాండును అందజేస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ అండగా నిలుస్తోందని ఆ పార్టీ మండల కన్వీనర్ కాశీంవలి అన్నారు. ఇటీవల కార్యకర్త కురవ నరసింహులు ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆయనకు టీడీపీ సభ్యత్వం ఉండడంతో రూ.5 లక్షలు పరిహారం మంజూరయింది. ఈ పాలసీ బాండ్‌ను ఆయన కుమారుడు శ్రీనివాసులు, కుటుంబ సభ్యులకు అందజేశారు. నరసింహులు చిత్ర పటానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగలదిన్నె జబ్బార్, డబ్బా ఈరన్న, మాజీ ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, సత్యారెడ్డి, సామేలు ఉన్నారు.

మా గోడు పట్టదా?

● పాతికేళ్లుగా పొలాలు మునిగిపోతున్నాయి
● జేసీ కారును అడ్డుకున్న ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, గోనెగండ్ల రైతులు

గోనెగండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాతికేళ్లుగా తమ ఆయకట్టు పొలాలు నీటి మునిగిపోతున్నాయని, తమ గోడు ఎవరికీ పట్టదా? అని ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, గోనెగండ్ల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ప్రాజెక్ట్ నీటి నిల్వ కారణంగా 150 నుంచి 200 ఎకరాల ఆయకట్టు భూములు మునిగిపోతున్నాయని రైతులు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని ఆయకట్ట భూములను ఆయన పరిశీలించడానికి వచ్చారు. అయితే జాయింట్ కలెక్టర్ వాహనాన్ని రైతులు అడ్డగించారు. ఏటా రబీలో సాగు చేసిన పంటలు నీట మునుగుతున్నాయని, ఖరీఫ్ సాగు చేసుకునేందుకు వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా సమస్య ఉన్నా, అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని చెప్పారు. ఆయకట్టు రైతులు నజీర్‌హమ్మద్, రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ బజారి, వీరేశ్ సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతూ జీడీపీ అధికారులు 376 మీటర్ల వరకు నీటిని నిల్వ చేస్తే కొంత భూమి మాత్రమే నీట మునుగుతుందని, అయితే 377 మీటర్ల వరకు నీటి నిల్వ చేయడం వల్ల 200 ఎకరాల వరకు ఆయకట్టు భూమి నీట మునుగుతోందని చెప్పారు. ఈ ఏడాది 377 మీటర్ల వరకు నీటిని నిల్వ చేయడంతో గోనెగండ్ల, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల తదితర గ్రామాల రైతులు సాగు చేసుకున్న పత్తి, మిరప, వేరుశనగ, ఉల్లి, మొక్కజొన్న పంటలు దాదాపు 180 ఎకరాలలోని పంట నీటి మునిగి దాదాపు రూ. 2కోట్ల మేర పంటనష్టం జరిగిందని జేసీకి వివరించారు. భూమిని సర్వే చేయకుండా, భూమిని రైతుల నుంచి కొనుగోలు చేయకుండా నీటిని ఎలా నిలుపుతారని వారు ప్రశించారు. జీడీపీ కట్ట ఎత్తు పెంచతుండడంతో నీటి నిల్వ శాతం కూడా ఒక టీఎంసీ పెరగుతుందని, అందుకుగానూ మరో 627 ఎకరాల భూమి అవసరమవుతుందని



జేసీ కారు ముందు బైఠాయించిన జీడీపీ ఎగువ ప్రాంత రైతులు

అధికారులు సర్వే చేశారని చెప్పారు. ఈ భూమిని కోల్పోయే రైతులకు భూమికి బదులు భూమితో పాటు రైతు కుటుంబంలో ఒకరి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని జేసీకి వినతి పత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన జేసీ మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు 376 మీటర్ల లోపే నీటిని నిలుపే విధంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. భూమి కొనుగోలు కు సంబంధించిన ఫైల్ కలెక్టర్ కార్యాలయంలో ఉందని, దాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

రైతుల మాటల్లో..

ఎన్నెకండ్ల గ్రామానికి చెందిన ఐరన్‌బండ మాజీ సర్పంచ్ బజారి మాట్లాడుతూ తనకు నాలుగు ఎకరాల భూమి ఉందని, అందులో వేరుశనగ, వరి, ఉల్లి, పంటలను సాగు చేశానని చెప్పారు. జీడీపీ నీటిలో పూర్తి గా మునిగి పోయి దాదాపు రూ. 2.50 లక్షల నష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చచేశారు. ఏటా ఇలాంటి దుస్థితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐరన్‌బండ గ్రామ రైతు వీరేశ్ మాట్లాడుతూ అధికారులు, నాయకులు స్పందించి భూమి సర్వే చేసి కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుల అభిప్రాయాలు లేకుండా సర్వేలు చేయడం భూమికి ధర నిర్ణయించడం సరికాదన్నారు. భూమికి భూమి కాని, మార్కెట్ ధర కాని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఆదోనిని జిల్లా చేయాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంత్రాలయం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆదోనిని జిల్లా చేయాలని, అప్పటి దాకా పోరాడతామని విద్యార్థి, యువజన, వైసీపీ, ప్రజాసంఘాల నాయకులు కోదండ, విద్యార్థి జేఏసీ కన్వీనర్ శేఖర్‌నాయుడు, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, కో కన్వీనర్ కృష్ణ అన్నారు. గురువారం మంత్రాలయంలో ఆదీని జిల్లా సాధన జేఏసీ నాయకులు ఆధ్వర్యంలో రాఘవేంద్ర సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. తహసీల్దారు రమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కమలగణేష్, ఖాజా, సత్యరెడ్డి, దస్తగిరినాయుడు, బతుకన్న, ఉదయ్, థామస్, రఘు, ఆఫ్రీది, రాజు, ఈరన్న, అమ్రేష్, సాగర్, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాశీంవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వీరేష్‌యాదవ్‌లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వీరేంద్రగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు షబ్బీర్, కాశీం, గణేశ్, ముస్తఫా, అహ్మద్ బాషా, శేషాద్రి, పరమేశ్వర, ఉస్మాన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై జేసీ ఆగ్రహం

గోనెగండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐరన్‌బండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, పాఠశాలను గురువారం జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించారు. పాఠశాలలో బాత్‌రూమ్‌లను విద్యార్థుల గదులను నీటి వసతిని రికార్డులను పరిశీలించారు. విద్య బోధన ఎలా సాగుతోందని తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంను తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. పిల్లల ఎత్తు, బరువుకు సంబందించిన రికార్డును ఆయన చూశారు. అనం తరం ఆయన పిల్లల ఎత్తును, బరువును జేసీ పరిశీలించారు. రికార్డులోఉన్నది వాస్తంగా ఉన్నది వేరుగా ఉండటంతో ముందుగా రికార్డు రాసినట్లు ఆయన గమనించి అంగన్‌వాడీ కార్యకర్తపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థినికి సన్మానం

నందవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నందవరం హైస్కూల్‌కు చెందిన విద్యార్థిణి నందినికి బంగారు పథకం రావడంతో గురువారం వ్యాయామ ఉపాధ్యాయులు ఉమాపతి, అబ్దుల్ లతీఫ్, సూరజ్‌తో పాటు విద్యార్థిని నందినిని ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రామకృష్ణమ రాజు మాట్లాడుతూ గత నెలలో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బేస్ బాల్ పోటీల్లో గెలుపొంది బంగారు పతకం సాధించిందని, జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బసవరాజు, ఎల్లప్ప, చంద్రశేఖర్, శేఖరప్ప, విజయలక్ష్మి, ఉమాదేవి, లక్ష్మీకళ, పరిమళ, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు అండగా ఉంటాం

మంత్రాలయం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దళిత క్రైస్తవులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ అండగా ఉంటామని జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమన్న అన్నారు. గురువారం సూగూరు గ్రామంలో తన నివాసం వద్ద గోనెగండ్ల మండలం చిన్ననెలటూరు గ్రామంలో రూ.10వేలను సంఘ నిర్వాహకులు హరీష్ పరుషరామ్, మోషె, నరసింహులుకు అందజేశారు. హనుమన్నను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ప్రభుదాసు, వెంకటేష్, మాణిక్యం, ఆదాము, సురేష్, యోహాను తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లెదర్ సొసైటీ షేర్ హోల్డర్స్‌కు న్యాయం చేయాలని ఎమ్మిగనూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి ఖాశీం వలీ డిమాండ్ చేశారు. పట్టణంలోని లెదర్ సొసైటి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని లెదర్ సొసైటీ షేర్ హోల్డర్లు 2వ రోజు రిలే నిరాహార దీక్షను కొనసాగించారు. ఈ దీక్షకు ఖాశీం వలి, వీరేశ్ మద్దతు తెలిపారు. దీక్షలో షేరు హోల్డర్లు కరెంటు జాన్, శాంతి రాజు, ఏసన్న, సుధాకర్ మరియదాసు, ఉసేని పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఎమ్మిగనూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంత్రాలయం రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయం ఆవరణంలో శనివారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక, విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, గూడూరు సబ్ డివిజన్ పరిదిలోని విద్యుత్ వినియోగదారులు ఈ వేదికలో పాల్గొని సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 3 గం నుంచి సాయంత్రం 5 గంల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'న్యాయం చేయకపోతే ఆందోళన చేపడతాం'

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మకు న్యాయం చేయకపోతే మళ్లీ ఆందోళన చేపడతామని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రంగయ్య, పరమేష్ హెచ్చరించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు బాధితురాలు గోవిందమ్మకు నివ సించేందుకు స్థలం కేటాయించకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం ముందు పునాది తవ్వి గుడిసె వేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శేషఫణి వారి వద్దకు వెళ్లి వారం రోజుల్లోపు సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో పునాది తవ్వడం నిలిపివేశారు. కార్యక్రమంలో వెంకటేష్, రంగస్వామి, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు చార్లెస్, బతకమ్మ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు



బనవాసి ఫారంలో సూచిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ప్రమాదకర మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఆదోని రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపుల దగ్గర గురువారం సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. మొత్తం ఆరు చోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీ చంద్ర, పీసీలు మల్లయ్య రమేష్, తిప్పన్న, తుకారాము, మునాఫ్, సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

33 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని డిమాండ్ చేశారు. పట్టణంలోని తేరుబజార్‌లో ఉన్న మంజునాథ్ ఫంక్షన్‌హాల్‌లో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ అధ్యక్షత వహించారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి, సహాయ కార్యదర్శి ఈరమ్మ, సులోచన, భారతి పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ఎమ్మిగనూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠేశ్వ స్వామి జాతరను పురష్కరించుకొని దివంగత నేత బీవీ మోహన్ రెడ్డి స్మారక మెగా క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. గత నెల 28న ప్రారంభమైన టోర్నమెంట్ ప్రస్తుతం మొదటి లీగ్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం మూడు మ్యాచుల్లో ఆరు జట్లు పాల్గొన్నాయి. ఆర్‌కే 11 జట్టు కంబళదిన్నే జట్ల మధ్య జరిగిన మ్యాచులో ఆర్‌కే 11 జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 97 పరుగులు చేయగా కంబళదిన్నె జట్టు 69 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. ఆర్‌కే 11 జట్టు ఆటగాడు తమ్మిని రంగా 30 పరుగులు చేయటంతో పాటు మూడు వికెట్లు తీసి అత్యుత్తమ ప్రతిభకనబరిచి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. దీంతో నిర్వాహకులు తమ్మిని రంగాను షీల్డుతో సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రంగస్వామి గౌడ్, హనుమంతు, సురేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు శిబిరం ఏర్పాటు



శిబిరంలో పాల్గొన్న అధికారులు, దివ్యాంగులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఉన్న భవిత కేంద్రంలో గురువారం జిల్లా సమగ్ర శిక్ష విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన దివ్యాంగులను పరీక్షించారు. మూగ, చెవుడు వారికి హియరింగ్ మిషన్లు, సెరిబ్రల్ పాలసీ వారికి వీల్‌చైర్లు, ఎముకలకు సంబంధించిన వారికి ట్రైసైకిళ్ల వంటి పరికరాలు అందించేందుకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. దాదాపు 150మంది దివ్యాంగుల పిల్లలు పాల్గొన్నారు. సమగ్రశిక్ష విభాగం ఏపీసీ ఎన్‌బీ లోకేష్ రాజు, సహిత విద్యా కో-ఆర్డినేటర్ సురేంద్ర, హెచ్ఎం గోవిందు, ఏంఈవోలు ఆంజనేయులు, మధుసుదన్ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు బాబు, విజయలత, ప్రత్యేక టీచర్లు ఎస్ బాబు, సుబ్బరాయుడు, ప్రకాష్, అనూరాధ, రాగన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

మంత్రాలయం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల, కళాశాలల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మోగా పీటీఎం సమావేశానికి మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని రచ్చమర్రి ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్‌నాయక్ ఆహ్వానించారు. గురువారం రాంపురం గ్రామంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. సిబ్బంది షరీఫ్‌వలి, సోమలింగం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వారికే ఉద్యోగావకాశాలు కల్పించాలి



మద్దతు తెలుపుతున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులు ఉద్యోగాలు కల్పించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ దుర్గా భవానీ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నిరాహర దీక్ష 18వ రోజు చేరుకుంది. సీపీఐ పట్టణ కార్యదర్శిలు రంగన్న, సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసి నాయకుల రాజు, ఏఐటీయుసి తాలుకా కార్యదర్శి తిమ్మ గురుడు, పట్టణ కార్యదర్శి విజయేంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహిస్తున్న పండితులు

మంత్రాలయం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో సామూహిక సత్యనారాయణ వ్రతం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. గురువారం మార్గశిర చతుర్దశి పౌర్ణమి శుభదినాన్ని పురస్కరించుకొని యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు.

● వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగూ ఊంజల సేవ నిర్వహించారు.

● మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటన ముగించుకుని గురువారం మంత్రాలయంకు చేరుకున్నారు. నాలుగురోజుల పాటు అయాప్రాంతాల్లో పూజలు చేసి అక్కడి భక్తులను ఆశీర్వాదించారు.

చింతలాముని స్వామికి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

గోనెగండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో వెలసిన చింతలాముని స్వామి జన్మదిన వేడుకలు గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామి మూల విరాట్‌కు తుంగభద్ర జలాభిషేకం చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేక పూలతో అలంకరించారు. 6 గంటలకు ఆకుపూజ, 7గంటలకు నైవేద్యం, 8 గంటలకు మహా మంగళ హారతి, 8.30లకు ఊయలసేవ, 9 గంటలకు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటలకు నైవేద్యం పూజ నిర్వహించారు, రాత్రి భజన కార్యక్రమం నిర్వహించారు. దత్తపూర్ణిమను పుస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

రమణీయం.. ఆంజనేయస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోసిగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోసిగి-సజ్జలగుడ్డం పొలాల్లో వెలసిన మార్లబండ ఆంజనేయ స్వామి రథోత్సవం గురువారం సాయంత్రం అశేష జన సందోహం మధ్య రమణీయంగా సాగింది. ఉదయం నుంచే ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు గౌళ్ల విశ్వనాథరెడ్డి, మల్లికార్జున రెడ్డి, గౌళ్ల వెంకటరెడ్డి, గౌళ్ల హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, మంత్రాలయం టీడీపీ నాయకులు రఘునాథ రెడ్డి, యువ నాయకులు రాకేష్ రెడ్డి తమ టీడీపీ అనుచరులతో కలిసి వేరు వేరు సమయాల్లో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి స్థానిక టీడీపీ నాయకులు, ఆలయ ధర్మకర్తలు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్ రెడ్డి, ట్రైనీ ఎస్ఐ ఈశ్వర్‌రావు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కంటి వైద్య శిబిరం

ఎమ్మిగనూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఉన్న వెంకటేశ్వర కంటివైద్యశాల వార్షికోత్సవం సందర్భంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కంటివైద్య శిబిరంలో దాదాపు 200 మంది రోగులకు కంటిపరిక్షలను డాక్టర్ నాగవంశీ కృష్ణ కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 50మందికి పైగా కంటి శుక్లం, 20మందికి టీరీజియం ఉన్నట్లు గుర్తించారు.

హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నందవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న ఎమ్మిగనూరులో జరిగే హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా సహాయ కార్యదర్శి దయాసాగర్, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల ఇన్‌చార్జి, ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ గురురాజారావు కోరారు. నందవరంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం గురురాజారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ హిందువుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీఎల్ నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి రామ్‌చరణ్, బడేసాబ్, మాజీ సర్పంచ్ రామన్నగౌడు, మండల ప్రధాన కార్యదర్శి గాజుల సురేంద్ర, కాశీంనాయుడు, శివ, వీరేశ్, డానీయే పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దకడబూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అశోక్‌వర్ధన్ రెడ్డి, ఏవోటీ లావణ్య, కిరణ్ కూమార్ సూచించారు. పెద్దకడబూరులోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆత్మ సిబ్బంది, ఏవో సుచరిత ఆధ్వర్యంలో నేల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేవీకే సిబ్బంది తేజకూమార్, పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, వ్యవసాయ సిబ్బంది సోని, రాఘవేంద్ర పాల్గొన్నారు.